
పింఛన్ మేసిన వలంటీర్లు..!

దొడ్డిదారిలో సదరం సర్టిఫికెట్లు

- నెల నెలా పింఛన్లు తీసుకున్నారు
- అదే దారిలో వైసీపీ నాయకులు
- ప్రభుత్వం మారడంతో వెలుగులోకి..

ప్రజలకు.. ప్రభుత్వానికి వారధిలా వలంటీర్లు సేవలు అందిస్తున్నారని వైసీపీ హయాంలో ఆ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు ఊదరగొట్టారు. కానీ అడ్డదారిలో ప్రభుత్వ పథకాలను అందుకున్నారని నెమ్మదిగా బయట పడుతోంది. అర్హత లేకున్నా సదరం సర్టిఫికెట్లు తెచ్చుకుని పలువురు అక్రమంగా పింఛన్లు పొందారు. తమ పేరిట, తమ కుటుంబ సభ్యుల పేరిట వలంటీర్లు అక్రమాలకు పాల్పడ్డారు. వీరితో పాటు పలువురు వైసీపీ నాయకులు అర్హత లేకున్నా పింఛన్లు అందుకున్నారు. అధికారులపై ఒత్తిడి తెచ్చి మరీ దోపిడీకి పాల్పడ్డారు. ప్రభుత్వం మారడంతో వీరి బాగోతాలు బయట పడుతున్నాయి. రాప్తాడు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పింఛన్ల అక్రమాలు కొనసాగాయి. అధికారం ఉందికదా.. ఎవరేం చేస్తారు అన్నట్లుగా అప్పనంగా ప్రజా ధనాన్ని కాజేశారు.

- రాప్తాడు



వడ్డించేవారే భోంచేశారు..

వైసీపీ హయాంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించే బాధ్యతను వలంటీర్లకే అప్పగించారు. ప్రతి 50 కుటుంబాలకు ఒక వలంటీర్‌ను నియమించారు. పథకాలకు అర్హులను గుర్తించడం, వారిచేత దరఖాస్తు చేయించడం, మంజూరైన పథకాలను లబ్ధిదారులకు చేర్చడంతో వలంటీర్లు కీలకంగా పనిచేశారు. ఇదే అదనుగా వడ్డించే సొమ్ములో కొంత అక్రమంగా భోంచేశారు. దివ్యాంగులకు ప్రభుత్వం అందించే సదరం సర్టిఫికెట్లను కొందరు వలంటీర్లు అక్రమంగా పొందారు. తమ పేరిట, తమ కుటుంబ సభ్యుల పేరిట సర్టిఫికెట్లు తీసుకుని.. పింఛన్లను మంజూరు చేయించుకున్నారు. ప్రతి నెలా పింఛన్ సొమ్ము పంపిణీ చేసేది వలంటీర్లే కావడంతో ఈ అక్రమాలు బయట పడలేదు. పైగా అందరూ వైసీపీ వర్గీయులే కావడంతో గుట్టుగా వ్యవహరించారు. ఇదే తరహాలో వైసీపీ నాయకులు కూడా అక్రమంగా సదరం సర్టిఫికెట్లు సంపాయించి.. అప్పనంగా పింఛన్లు అందుకున్నారు.



వైకల్యం లేకపోయినా..

- రాప్తాడు పరిధిలో పలువురు వలంటీర్లు, వారి కుటుంబ సభ్యులు వైకల్యం లేకపోయినా సదరం సర్టిఫికెట్లు తెచ్చుకున్నారు. వాటి ఆధారంగా అక్రమంగా పింఛన్లు పొందుతున్నారు. వలంటీరు సుగాలి లక్ష్మిదేవి తన భర్త దాసరి శబరికి వైకల్యం లేదు. అయినా ఆయన పేరిట సదరం సర్టిఫికెట్ తెచ్చుకున్నారు. ఐడీ నంబర్ 11200155753 ద్వారా పింఛన్ పొందారు. వలంటీరు మారుతి భర్త శివ పింఛన్ పొందేందుకు అనర్హుడు. వైకల్యం లేకపోయినా.. సదరం సర్టిఫికెట్‌తో ఐడీ నంబర్ 11200099942 ద్వారా పింఛన్ పొందుతున్నాడు. వలంటీర్ ఘని తల్లి ఆదినారాయణమ్మ కూడా ఐడీ నంబర్ 1121128048 ద్వారా పింఛన్ తీసుకుంటున్నారు. వలంటీర్ చాకలి లక్ష్మీదేవి, తన తల్లి నాగలక్ష్మి పేరిట అక్రమంగా పింఛన్ పొందుతున్నారు. వలంటీర్ ఆవ తన తల్లి పేరిట పింఛన్ పొందుతున్నారు.



ఆదర్శ దంపతులు..!

కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి బండి సరస్వతి వలంటీరుగా పనిచేస్తూనే పింఛన్ తీసుకుంది. ప్రభుత్వం నుంచి పారితోషికం తీసుకునే వారు పింఛన్‌కు అనర్హులు. కానీ, పింఛన్లు పంపిణీ చేసేదే ఆమె కాబట్టి.. ఈ వ్యవహారం బయట పడలేదు. వైసీపీ అధికారంలోకి రాగానే వలంటీరు అయిన సరస్వతి.. తొలుత ఏడాదిన్నర పాటు తానొక్కటే పింఛన్ తీసుకుంది. ఇందుకోసం అడ్డదారిలో సదరం సర్టిఫికెట్ తీసుకుంది. ఐడీ నంబర్ 12500031123 కింద పింఛన్ మంజూరు చేయించుకుంది. ప్రతి నెలా పింఛన్ పొందింది. ఆ తరువాత తన భర్త బండి రవి పేరిట కూడా సదరం సర్టిఫికెట్ తెప్పించి.. పింఛన్‌కు దరఖాస్తు చేయించింది. ఆయన పింఛన్ ఐడీ నంబర్ 12500015878. వైసీపీ హయాంలో ప్రతి నెలా పింఛన్ పొందాడు. ఇలా దంపతులిద్దరూ అక్రమంగా సదరం సర్టిఫికెట్లను సంపాదించి పింఛన్ తీసుకుంటూ.. ఆదర్శ దంపతులయ్యారు. ఇక్కడ ఇంకో విశేషం ఉంది. రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై అంబోతులా దాడి చేసింది ఈ బండి రవినే..! ఈ కేసులో 'ఎంత వెతికినా' తమకు బండి రవి దొరకడం లేదని డీఎస్పీ దొరవారు సెలవిచ్చారు. కానీ, ఎన్నికల సమయంలో స్వగ్రామంలో దర్జాగా టీడీపీ వర్గీయులపై దాడి చేశాడు. అప్పుడు కూడా నామమాత్రపు కేసుతో సరిపెట్టారు. వైసీపీ హయాంలో ఇలా దాడులు చేసేవారికి చేయూతనిచ్చేందుకు పింఛన్లు మంజూరు చేయించినట్లు కనిపిస్తోంది. టీడీపీ కూటమి ప్రభుత్వమైనా చొరవ చూపి.. అక్రమంగా తీసుకున్న పింఛన్లను కక్కించాలి. సదరం సర్టిఫికెట్లను గుడ్డిగా మంజూరు చేసిన వైద్యులను గుర్తించి.. కఠిన చర్యలు తీసుకోవాలి.



పింఛన్ అందిస్తున్న బండి సరస్వతి(ఫైల్)

- కనగానపల్లి మండలం కోనాపురం గ్రామానికి చెందిన వలంటీరు గవ్వల మల్లప్ప దివ్యాంగుడు కాదు. అయినా సదరం సర్టిఫికెట్ తెచ్చుకుని.. ప్రతి నెలా పింఛన్ తీసుకుంటున్నాడు. ఇదే గ్రామానికి చెందిన వలంటీరు సుధీర్.. తన తండ్రికి అక్రమంగా పింఛన్ ఇప్పించాడు. మత్స్యకారుడని చూపించి.. దొడ్డిదారిలో సర్టిఫికెట్ పొంది, పింఛన్ ఇప్పించాడు.
- రాప్తాడు మండలం రామినేపల్లికి చెందిన వైస్ ఎంపీపీ వరలక్ష్మి భర్త మన్నల రవి కుమార్ పింఛన్‌కు అర్హుడు కాదు. అయినా దొడ్డిదారిన సదరం సర్టిఫికెట్ తెప్పించుకుని.. ఐడీ నంబర్ 11200198868 ద్వారా పింఛన్ తీసుకుంటున్నారు.

సారీ.. నాకు పెళ్లైంది..!



నందిని

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన ఆమెకు పొరపాటున ఫోన్ చేశాడు గుంతకల్లువాసి. అంతటితో ఆగిపోలేదు ఇద్దరూ..! ఐదేళ్లు మాట్లాడుకున్నారు. ఇంకెన్నాళ్లని మాట్లాడుకుంటారు..? 'నన్ను పెళ్లి చేసుకో..' అని అడిగింది ఆమె. 'సరే.. రా..' అన్నాడు అతను. అంతే.. ఆమె రైలు ఎక్కింది. కర్నూలులో మంగళవారం దిగింది. ఇద్దరూ అక్కడే కలుసుకున్నారు. మరుసటి రోజు గుంతకల్లుకు వచ్చారు. సత్యనారాయణపేటలోని ఓ ఇంట్లో దిగారు. 'ఇంక పెళ్లి చేసుకుందాం పద..' అంది ఆమె..! 'సారీ.. నాకు ఇదివరకే పెళ్లైంది.. పిల్లలు కూడా ఉన్నారు..! నువ్వు మీ ఊరెళ్లిపో..' అన్నాడు అతను. 'ఆ విషయం ఇన్నాళ్లు ఎందుకు చెప్పలేదు..? ఇక్కడికెందుకు రమ్మన్నావు..? నేను తిరిగి వెళ్లను. పెళ్లి చేసుకోవాల్సిందే..' అంది ఆమె..! మనోడికి సీన్ అర్థమైంది. 'ఉండు.. నీకు తినడానికి ఏమైనా తెస్తా..! ఆ తరువాత మాట్లాడుకుందాం..' అని చెప్పి.. అక్కడి నుంచి జారుకున్నాడు. చాలా పాత టెక్నిక్కే..! రోజు గడిచినా అతను తిరిగి రాలేదు. ఆమెకు విషయం అర్థమైంది. సమీపంలో ఉన్న కసాపురం పోలీస్ స్టేషన్‌కు గురువారం వెళ్లింది. 'అతని పేరు స్వామి. గుంతకల్లు పట్టణంలోని ఓ పెట్రోల్ బంకులో పనిచేస్తాడు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు. న్యాయం చేయండి..' అని వేడుకుంది. రాంగ్ నంబర్ ఫోన్ కాల్ నుంచి.. ఇప్పటి వరకూ జరిగిన విషయాలన్నీ పూసగుచ్చినట్లు వివరించింది. పోలీసులు ఫిర్యాదు స్వీకరించారు. తరువాత ఏం జరుగుతుందో.. తెలియాల్సి ఉంది.

- గుంతకల్లు టౌన్

రైతు ఆత్మహత్య



కూడేరు, జూలై 11: ముద్దలాపురం గ్రామానికి చెందిన రైతు వన్నూరప్ప(33) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. వన్నూరప్పకు నాలుగున్నర ఎకరాల పొలం ఉంది. పక్క పొలాల రైతుల నుంచి బోరుబావి నీటిని తీసుకుని బ్యాడిగ మిరప, ఆముదం, వేరుశనగ తదితర పంటలను సాగు చేసేవాడు. మూడేళ్లుగా పంటలు సరిగా పండక అప్పులు రూ.10 లక్షలకు పైగా పేరుకుపోయాయి. ఈ ఏడాది పెట్టుబడికి అప్పులు పుట్టకపోవడంతో తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గురువారం సాయంత్రం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు.. అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. వన్నూరప్పకు భార్య వాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఈ చావు.. మద్యం సిరాతో..!



మద్యానికి బానిసైన అన్న.. కన్నతల్లి గొంతు కోశాడు. విషయం తెలుసుకున్న తమ్ముడు.. ఆవేదనతో ఉరి వేసుకున్నాడు. ఈ విషాద సంఘటన కుందుర్పి మండల పరిధిలోని కలిగులిమి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. శెట్టూరు మండలం ముచ్చర్లపల్లికి చెందిన లక్ష్మీదేవికి శివ, రాజయ్య అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. రాజయ్యకు కలిగులిమి గ్రామానికి చెందిన శిల్పతో వివాహమైంది. కొన్నాళ్లుగా శిల్ప పుట్టింట్లో ఉంది. దీంతో రాజయ్య బుధవారం భార్య వద్దకు వెళ్లాడు. మద్యానికి బానిసైన శివ.. పింఛన్ డబ్బులు ఇవ్వాలని తల్లిని అడిగాడు. ఆమె ఇవ్వకపోవడంతో బుధవారం అర్ధరాత్రి కత్తితో గొంతు కోశాడు. స్థానికులు ఆమెను వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాజయ్య.. తీవ్ర ఆవేదనకు లోనయ్యాడు. కలిగులిమి గ్రామ శివారులో చింత చెట్టుకు గురువారం వేకువ జామున ఉరివేసుకున్నాడు. తెల్లవారిన తరువాత అటువైపు వెళ్లిన వారు గమనించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. **- కుందుర్పి**

అప్పులు ఎక్కువై.. దిక్కుతోచక..!

- పారిపోయిన చిట్టీల వ్యాపారి..
- పోలీసులను ఆశ్రయించిన బాధితులు



గుత్తి పోలీస్ స్టేషన్‌లో బాధితులు

గుత్తి, జూలై 11: చిట్టీలు వేసిన ఓ విశ్రాంత ఉద్యోగి.. అప్పులు ఎక్కువై పారిపోయాడు. సుమారు రూ.కోటి వరకూ మోసపోయామని పలువురు మహిళలు గుత్తి పోలీస్ స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. గుత్తి ఆర్ఎస్‌లోని బండిమోటు వీధిలో ఉంటున్న అత్తర్ హుస్సేన్.. రైల్వేలో పని చేస్తూ ఐదేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశాడు. సుమారు పదిహేనేళ్ల నుంచి చిట్టీలు నడుపుతున్నాడు. రూ.లక్ష నుంచి రూ.3 లక్షల చిట్టీలు నడిపేవాడని, గతంలో క్రమం తప్పకుండా సొమ్ము చెల్లించేవాడని బాధితులు తెలిపారు. ఇటీవల అప్పుల్లో కూరుకుపోయాడని సమాచారం. ఈ నేపథ్యంలో గత నెలలో బక్రీద్ పండుగ ముగిశాక తరువాత అత్తర్ హుస్సేన్, ఆయన భార్య ఎటో వెళ్లిపోయారు. అనుమానం వచ్చి ఆరా తీయడంతో ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోయారని తెలిసిందని బాధితులు వాపోయారు. సొంత ఇల్లే అయినా.. బ్యాంకులో తాకట్టు పెట్టాడని, బయటి సంస్థలలో పెద్ద ఎత్తున రుణాలు తీసుకున్నాడని తెలిపారు. రుణాలను తిరిగి చెల్లించలేకపోయాడని, ఈ కారణంగా తమకు చిట్టీల డబ్బులు కూడా ఆలస్యంగానే ఇచ్చేవాడని అన్నారు. ఉన్నట్టుండి పారిపోవడంతో తమకు దిక్కుతోచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూలీనాలీ చేసుకుని చిట్టీలు వేశామని, సుమారు 40 మందికి డబ్బులు రావాల్సి ఉందని అన్నారు. తమకు న్యాయం చేయాలని పోలీసులకు విన్నవించారు.

ముడుపులా.. జరిమానానా..?



ఏదో ఒకటే చెల్లిస్తాం.. రెండూ అంటే కుదరదు

- పద్ధతిగా ఉంటాం.. తనిఖీలకు రండి..
- ముడుపులు కావాలంటే.. తనిఖీలను ఆపేయండి
- తేల్చి చెప్పిన సా మిల్లుల నిర్వాహకులు..?
- అటవీశాఖలో అక్రమార్కుల ఆదాయానికి గండి

అనంతపురం న్యూటౌన్, జూలై 11: 'ముడుపులు కావాలా..? జరిమానా కట్టాలా..? ఏదో ఒకటి నిర్ణయించుకోండి. నెల నెలా వచ్చి మామూళ్లు తీసుకుపోతారు. మళ్లీ తనిఖీలకు వచ్చి జరిమానా విధిస్తారు. ఇట్లైతే కుదరదు. ఏదో ఒక్కటే చెల్లిస్తాం. డిసైడ్ చేసుకోండి..' అని సా మిల్లుల యజమానులు అటవీశాఖలోని 'మామూలు' అధికారులకు స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం సా మిల్లులు నిర్వహించుకుంటామని, తమ వైపు తప్పు ఉంటే జరిమానాలు కట్టేందుకు సిద్ధమని అంటున్నారు. వారి తిరుగుబాటుతో అటవీశాఖ అనంతపురం రేంజ్ పరిధిలో జరుగుతున్న అక్రమాలు బయట పడుతున్నాయి. అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో పనిచేసే సిబ్బందిలో కొందరు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని బాధితులు వాపోతున్నారు. సా మిల్లుల యూనియన్ నాయకులు ఎదురు దాడికి సిద్ధమయ్యారు.

గోడ దెబ్బ.. చెంప దెబ్బ

అటవీశాఖలో అక్రమాలకు తావులేదని డీఎఫ్ఓ వినీత్ కుమార్ అంటున్నారు. ఎవరికీ ఒక్క రూపాయి కూడా మామూళ్లు ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేస్తున్నారు. నిబంధనలు పాటిస్తే చాలని బహిరంగంగా చెబుతున్నారు. కానీ.. ఇలా అయితే తమ జేబులు నిండేదెలా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు అక్రమార్కులు. డీఎఫ్ఓ కోసం తనిఖీలు చేసి జరిమానాలు విధిస్తున్నారు. తమకోసం నెల నెలా వెళ్లి మామూళ్లు పుచ్చుకుంటున్నారు. దీంతో సా మిల్లుల నిర్వాహకులకు గోడ దెబ్బ.. చెంప దెబ్బ.. రెండూ పడుతున్నాయి. లబోదిబో అంటున్నారు. ఇట్లయితే కుదరదని, ఏదో ఒకటే ఎంచుకోవాలని అక్రమార్కులను డిమాండ్ చేస్తున్నారు.

మాది మాకు ఇవ్వాల్సిందే..

'డీఎఫ్ఓ చెబితే మాత్రం.. ముడుపులు ఇవ్వరా..? అదేం కుదరదు. కార్యాలయంలో ఖర్చులు ఉంటాయి. వాటిని ఎవరు భరిస్తారు..? మాది మాకు ఇవ్వాల్సిందే.' అని వసూళ్లకు వెళుతున్నారు సిబ్బందిలో కొందరు. దీంతో చేసేది లేక చాలామంది సా మిల్లుల నిర్వాహకులు ముడుపులు కట్టి పంపిస్తున్నారని సమాచారం. 'ఫీల్డ్ తనిఖీలకు వెళ్లాల్సిందే. అక్కడ ఏదైనా తేడా కనిపిస్తే చర్యలు తప్పవు..' అని డీఎఫ్ఓ హెచ్చరిస్తున్నారు. దీంతో ఉద్యోగులు సా మిల్లుల తనిఖీలకు వెళుతున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉంటే జరిమానా విధిస్తున్నారు. డీఎఫ్ఓకు రిపోర్ట్ ఇవ్వడానికి ఇలా చేయక తప్పడం లేదని అంటున్నారు. ఇక్కడే సమస్య మొదలైంది. 'ఇలా ఎన్నాళ్లు..?' అని సా మిల్లుల నిర్వాహకులు మండిపడుతున్నారు. నిబంధనల ప్రకారం సా మిల్లులను నిర్వహించుకుంటామని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అంటున్నారు. ముడుపులు ఇవ్వాలంటే అక్రమాలను చూసీ చూడనట్లు వదిలేయాల్సిందే అని పరోక్షంగా చెబుతున్నారు. కాదూ కూడదు అంటే.. అక్రమాల గురించి ఉన్నతాధికారులకు చెబుతామని కొందరు హెచ్చరించినట్లు తెలిసింది. 'అటు డీఎఫ్ఓ.. ఇటు సామిల్లుల నిర్వాహకులు..! మధ్యలో తమ అక్రమార్జనకు గండిపడేలా ఉంది..' అని అక్రమార్కులు తెగ ఆవేదన చెందుతున్నారని సమాచారం. పరిస్థితి ఏమిటో తెలియాలంటే.. డీఎఫ్ఓ స్వయంగా క్షేత్రస్థాయికి వెళ్లాల్సిన అవసరం ఉందని పలువురు అంటున్నారు.



నేరుగా వచ్చి చెప్పేశారా..?

ముడుపులు.. జరిమానాల సంగతి అటో ఇటో తేల్చుకోవాలని సా మిల్లుల యూనియన్ నాయకులు భావిస్తున్నట్లు కనిపిస్తోంది. ఇటీవలే కొందరు నాయకులు రేంజర్ కార్యాలయానికి వచ్చి ఏదో ఒకటి నిర్ణయించుకోవాలని తెగేసి చెప్పినట్లు సమాచారం. 'మీరు తనిఖీలకు వచ్చేటట్లు అయితే మామూళ్ల కోసం రాకండి. ఎప్పుడైనా తనిఖీలు చేసుకోండి. మా వైపు తప్పుంటే అపరాధ రుసుం ఎంతైనా విధించండి. చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నాం. అలా కాకుండా రెండూ కావాలంటే మీ ఉన్నతాధికారులకు చెప్పాల్సి ఉంటుంది. ఇప్పటివరకు ఎవరెవరికి ఎంతెంత ఇచ్చామో చిట్టా విప్పాల్సి ఉంటుంది..' అని హెచ్చరించినట్లు తెలిసింది. దీంతో ఫీల్డ్ స్థాయి సిబ్బంది అయోమయంలో పడ్డారని ప్రచారం జరుగుతోంది. ఈ పంచాయితీ నేపథ్యంలో ఒత్తిడి తట్టుకోలేక ఓ అధికారి వ్యక్తిగత పనుల పేరిట సెలవులో వెళ్లినట్లు తెలిసింది.

పొసగడం లేదు..

అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఓ అధికారికి, సిబ్బందికి పొసగడం లేదు. కింది స్థాయి సిబ్బందితో తాను పని చేయించలేనని ఆ అధికారి డీఎఫ్ఓకు చెప్పినట్లు సమాచారం. అయితే, ఆయన వద్ద తామూ పనిచేయలేమని దిగువస్థాయి సిబ్బంది కూడా అంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. క్షేత్రస్థాయికి వెళ్లి.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవాటికి తాము జరిమానా విధిస్తున్నామని, ఆ చలానాలో సంతకాల కోసం వెళితే.. తాము వేసిన జరిమానా కంటే ఎక్కువగా రాస్తున్నారని కొందరు ఏబీఓలు, ఎఫ్‌బీఓలు అంటున్నారు. ఫీల్డ్‌లో తాను అక్రమార్కులను పట్టుకుని జరిమానా వసూలు చేసినట్లు డీఎఫ్ఓకు చూపించుకునేందుకు ఆ అధికారి అలా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

బడి మెరుగుపడాలి

- పిల్లలందరూ పాఠశాలల్లో ఉండాలి
- విద్యాశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం





సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్, పాల్గొన్న డీఈఓ, ఎస్ఎస్ఏ అధికారులు, ఎంఈఓలు

అనంతపురం టౌన్, జూలై 11: ప్రభుత్వ పాఠశాలల పనితీరు మరింత మెరుగుపడాలని విద్యాశాఖ అధికారులు, ఎంఈఓలను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. విద్యాశాఖ, ఎస్ఎస్ఏ పరిధిలో పథకాలు, అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల గురించి కలెక్టరేట్‌లో గురువారం సమీక్ష నిర్వహించారు. నాడు-నేడు పెండింగ్ పనుల వివరాలను ఇవ్వాలని సూచించారు. పాఠశాలలు ఆహ్లాదకరంగా ఉండేలా చూడాలని అన్నారు. కొన్ని మండలాలలో పరిస్థితులు అధ్వానంగా ఉన్నాయని, క్షేత్రస్థాయికి వెళ్లి చక్కదిద్దాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖ, ఎస్ఎస్ఏ అధికారులు, ఎంఈఓల పనితీరు మరింత మెరుగుపడాలని అన్నారు. కేజీబీవీలలో ఇంటర్ ఉత్తీర్ణత ఏటా తగ్గుతోందని, ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా బడిఈడు పిల్లలు వందశాతం బడిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉరవకొండలో ఒక్కటే బడి బయట ఉన్న 1,617 మందిని గుర్తించారని, మిగిలిన మండలాలలో ఎందుకు గుర్తించలేదని కలెక్టరు ప్రశ్నించారు. అన్ని మండలాలలో వారంలోగా వందశాతం పిల్లలను బడిలో చేర్పించి నివేదికలు ఇవ్వాలని హెచ్చరించారు. షెడ్యూల్ వచ్చిన తర్వాత జ్ఞానజ్యోతి కింద ఎస్‌జీటీలకు, అంగన్‌వాడీలకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యాపథకాలు, సౌకర్యాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. విద్యార్థుల కిట్లలో యూనిఫామ్స్, బ్యాగ్స్, డిక్షనరీలు, బూట్లు, పాఠ్య పుస్తకాలను త్వరగా పంపిణీ చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం పథకం అమలు విషయంలో సాకులు చెప్పవద్దని, భోజనం వండకపోతే మీదే బాధ్యత అని అధికారులతో అన్నారు. విద్యార్థులు పాఠశాలల బయట భోజనం తినకూడదని అన్నారు. చిక్కీల గడువును ఎప్పటికపుడు పరిశీలించాలని, కాలం గడిచిన వాటిని పిల్లలకు పంపిణీ చేయకూడదని అన్నారు. విద్యాశాఖలో అధికారుల నుంచి వాచ్‌మెన్ వరకూ క్యాడర్ల వారీగా ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను అందజేయాలని డీఈఓకు సూచించారు. సమావేశంలో డీఈఓ వరలక్ష్మీ, ఏడీలు కృష్ణయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు కరివేపాకు..!

- పాతాళానికి పడిపోయిన కరివేపాకు ధర
- నెలన్నర కిందట కిలో రూ.35.. ఇప్పుడు రూ.3
- గగ్గోలు పెడుతున్న రైతులు

తాడిపత్రి, జూలై 11: కరివేపాకు రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. నెలన్నర వ్యవధిలోనే ధర పాతాళానికి పడిపోయింది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఏడాది మేనెలలో కిలో రూ.35 ఉన్న కరివేపాకు ధర ప్రస్తుతం మూడు రూపాయలకు చేరింది. మరికొన్ని రోజులు ఇదే ధర ఉంటే ఆత్మహత్యలు చేసుకోకతప్పదని కరివేపాకు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడిపోయిన ధర కారణంగా పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొంది. పంటను కోసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేయడం వల్ల లాభం రాకపోగా నష్టాలు మిగలనున్నాయి. కూలి ఖర్చులు, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో కరివేపాకు పంటపై రైతులు ఆశలు వదులుకున్నారు.

వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగు

తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో వందలాది ఎకరాల్లో కరివేపాకు సాగవుతోంది. తాడిపత్రిలో 300 ఎకరాలు, పెద్దపప్పూరు 700ఎకరాలు, యాడికి వంద ఎకరాలు, యల్లనూరు 50ఎకరాలు, పుట్లూరు 50ఎకరాల్లో కరివేపాకు సాగు చేస్తున్నారు. ఒకప్పుడు కోస్తా ప్రాంతంలోని వడ్లపూడి తర్వాత తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లిలో మాత్రమే కరివేపాకు సాగు ఉండేది. ఒడిశా నుంచి కరివేపాకు విత్తనాలు వడ్లపూడి, మంగళగిరి, గుంటూరు ప్రాంతాలకు సరఫరా అయ్యేవి. అక్కడి నుంచి రైతులు తాడిపత్రికి తీసుకొచ్చి విక్రయించేవారు. కానీ ప్రస్తుతం ఆ ప్రాంతాల్లో కూడా కరివేపాకు సాగు అధిక విస్తీర్ణంలో జరుగుతోంది. దీంతో తాడిపత్రి కరివేపాకుకు డిమాండ్ పడిపోయింది. తాడిపత్రి మండలంలోని ఎర్రగుంటపల్లి ప్రాంతం సాగుకు అన్నివిధాల అనుకూలంగా ఉండటంతో పాటు వాతావరణ పరిస్థితులు కూడా సహకరించడం వల్ల నాణ్యమైన కరివేపాకు పండేది. పెద్దపప్పూరు మండలంలో కూడా పెద్దఎత్తున కరివేపాకు సాగవుతోంది. తాడిపత్రి ప్రాంతానికి చెందిన రైతులు ఇతర ప్రాంతాలకు చెందిన వారి పొలాలను గుత్తకు తీసుకొని కరివేపాకును సాగు చేయడమే కాకుండా అక్కడివారికి ఈ పంటను పరిచయం చేశారు.



చెన్నైకు తరలించేందుకు కోసి కట్టలు కట్టిన కరివేపాకు

రైతుల ఆశలకు గండి



ఐదెకరాల్లో కరివేపాకు పంట సాగుచేశా. గతంలో ధర బాగున్నా ప్రస్తుతం కరివేపాకు ధర పాతాళానికి పడిపోయింది. నెలన్నర కిందట కిలో రూ.30నుంచి 35 ఉన్న కరివేపాకు నేడు మూడు రూపాయలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. మరికొన్నిరోజులు ఇదే పరిస్థితి ఉంటే రైతులు అప్పులపాలు కాక తప్పదు.

- సూర్యనారాయణ, రైతు, యర్రగుంటపల్లి

సాగు ఎక్కువ కావటం వల్లే...



అన్ని ప్రాంతాల్లో కరివేపాకు సాగు ఎక్కువగా ఉండటంతో దిగుబడి ఎక్కువగా ఉంది. దీంతో ధరలు పడిపోయాయి. పెట్టుబడి కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే అప్పులపాలు కావడం ఖాయం. ఆరు ఎకరాల్లో పంట సాగుచేశా. దిగుబడి వచ్చింది కానీ రేటు లేదు. కొత్తగా బోర్ల కోసం రూ.4లక్షలు ఖర్చుచేశా.

- యుగంధర్, రైతు, యర్రగుంటపల్లి



ఏపుగా పెరిగిన కరివేపాకు పంట

ధర తగ్గడానికి పెరిగిన దిగుబడే కారణమా?

కరివేపాకు దిగుబడి పెరిగిన కారణంగా ధర తగ్గింది. గతంలో కొన్ని ప్రాంతాల్లోనే ఈ పంటను సాగుచేసేవారు. ప్రస్తుతం గుత్తి, గుంతకల్లు తదితర ప్రాంతాల్లో కూడా సాగు ఎక్కువగా చేస్తుండటంతో దిగుబడి పెరిగి, ధర అమాంతం పడిపోయింది. తాడిపత్రి ప్రాంత కరివేపాకు హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, ముంబై, చెన్నై, బెంగళూరు తదితర నగరాలకు రవాణా అవుతోంది.

పంట రక్షణకు పాట్లు

ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులతో బోరుబావుల్లో నీరు అడుగంటింది. దీంతో కరివేపాకు పంటను రక్షించుకునేందుకు తాడిపత్రి, పెద్దపప్పూరు తదితర మండలాల్లో పెద్దఎత్తున కొత్త బోర్లు వేస్తున్నారు. ఇందుకోసం లక్షలాది రూపాయలు ఖర్చుచేస్తున్నారు 900 నుంచి 1000 అడుగుల వరకు బోరుబావులు తవ్విస్తున్నారు. అయినా రైతులకు నిరాశే ఎదురవుతోంది. బోరు వేసేందుకు అడుగుకు రూ.100 నుంచి రూ.120 వరకు ఖర్చు చేస్తున్నారు. దీన్నిబట్టి చూస్తే ఒక్కో బోరుకు రూ.1.30లక్షల వరకు ఖర్చుచేసే పరిస్థితి ఏర్పడుతోంది. అరకొరగా పడిన నీటి కోసం కేసింగ్‌ల పేరుతో మరో రూ.10 వేలను వ్యయం చేస్తున్నారు. నీళ్లు పడే బోర్ల కన్నా నీళ్లు పడని బోర్లు ఎక్కువగా ఉండటం వల్ల రైతుల్లో ఆందోళన వ్యక్తమవు తోంది. ఆస్తులు తాకట్టు పెట్టడంతో పాటు ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి బోర్లు వేస్తున్నా అదృష్టం వరించడంలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆర్థికమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కేశవ్



బాధ్యతలు స్వీకరిస్తున్న మంత్రి కేశవ్

ఉరవకొండ, జూలై 11: అమరావతిలోని సచివాలయం రెండో బ్లాక్‌లోని తన చాంబర్‌లో ఆర్థికశాఖ మంత్రిగా పయ్యావుల కేశవ్ గురువారం బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన మంత్రికి కార్యాలయ అధికారులు అభినందనలు తెలిపారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో జవాబుదారీ తనంతో కూడిన పారదర్శక పాలన రాష్ట్ర ప్రజలకు అందించేందుకు కృషి చేస్తానని మంత్రి కేశవ్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి హేమలత, కుమారులు విక్రమ్‌సింహా, విజయ్‌సింహా, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

జలవనరుల శాఖ సీఈ నాగరాజ..



బాధ్యతలు స్వీకరించిన సీఈ నాగరాజ

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: జలవనరుల శాఖ సీఈగా కె. నాగరాజ నియమితులయ్యారు. విజయవాడలో జలవనరుల శాఖ ఈఎన్‌సీ కార్యాలయంలో పీపీఎంయూ విభాగం సీఈగా పనిచేస్తున్న ఆయన్ను ఇక్కడికి బదిలీ చేశారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న సీఈ శ్రీనివాసరెడ్డి గత నెల 30న ఉద్యోగవిరమణ పొందారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన సీఈ నాగరాజ గురువారం స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని జలవనరుల శాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో కర్నూలు హంద్రీనీవా ఎస్‌ఈగా ఉంటూ ఇక్కడ ఇన్‌చార్జి సీఈగా ఏడాదిన్నర పాటు పనిచేశారు. తిరిగి ఇక్కడికి రావడం పట్ల సంతోషంగా ఉందని సీఈ తెలిపారు. అనంతరం హంద్రీనీవా ఈఈలు రాజా స్వరూప్‌కుమార్, ఏపీ ఇరిగేషన్ ఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, మహబూబ్‌దౌలా, వీరేంద్ర, సుధాకర్, డీఈలు, ఏఈలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మైనర్ ఇరిగేషన్ ఎస్ఈ విశ్వనాథ్‌రెడ్డి..



ఎస్ఈగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్‌రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: మైనర్ ఇరిగేషన్ ఎస్ఈగా విశ్వనాథ్‌రెడ్డి నియమితులయ్యారు. ఇదివరకు ఎస్ఈగా ఉన్న శ్రీనివాసులు రెడ్డి గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో మైనర్ ఇరిగేషన్‌లో డిప్యూటీ ఎస్ఈగా ఉన్న విశ్వనాథ్‌రెడ్డికి ఎస్ఈగా ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగించారు. దీంతో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మైనర్ ఇరిగేషన్ ఈఈ నారాయణనాయక్, డీఈలు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య ..



విజిలెన్స్ ఎస్పీ మునిరామయ్య

అనంతపురం న్యూటౌన్, జూలై 11: అనంతపురం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీగా మునిరామయ్యను గురువారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీగా ఆయన్ను నియమిస్తూ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. గురువారం జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి, శుభాకాంక్షలు తెలిపారు.

గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా ప్రమోద్



గుత్తి, జూలై 11: గుత్తి రైల్వే డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈగా జేజీ ఎంపీ ప్రమోద్‌ను నియమిస్తు రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం స్థానిక డీజిల్ షెడ్ పనిచేస్తున్న రమేష్‌ను తిరుపతి సీఆర్ఎస్ డిప్యూటీ సీఎంఈగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుతం డీజిల్ షెడ్‌లో డీఎంఈగా పనిచేస్తున్న ప్రమోద్‌కు సీనియర్ డీఎంఈగా ఉద్యోగోన్నతి కల్పించారు. ప్రమోద్ జన్మస్థలం కడప జిల్లా ప్రొద్దుటూరు, ఈయన ముంబై ఐఐటీలో చదివాడు. 2020లో రైల్వే శాఖలో ఐఆర్ఎస్ఎంఈ క్యాడర్‌లో ఉద్యోగంలో చేరారు. ప్రమోద్‌కు కార్మికుల సంఘాల నాయకులు, కార్మికులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

నేడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు



గూగూడులో పర్యటిస్తున్న ఎస్పీ గౌతమి శాలి

నార్పల, జూలై 11: ప్రసిద్ధి చెందిన గూగూడు కుళ్లాయిస్వామి ఐదో సరిగెత్తు కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ అధికారి శోభ తెలిపారు. కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారిని భక్తులు పెద్ద ఎత్తున దర్శించుకున్నారు. జిల్లా ఎస్పీ గౌతమి శాలి గూగూడులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె చిన్న సరిగెత్తు, పెద్దసరిగెత్తు, జలధి కార్యక్రమ ఏర్పాట్లపై చర్చించారు. ఉత్సవాలు జరిగినన్ని రోజులు 24గంటలు పోలీసులు అందుబాటులో ఉండాలన్నారు. మహిళలు, పిల్లల కోసం మహిళా పోలీసులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం జంట ఆలయాల్లో ఎస్పీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటశివారెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, దేవదాయశాఖ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణతోనే పేదరిక నిర్మూలన



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ సిబ్బంది

అనంతపురం టౌన్, జూలై 11: జనాభా నియంత్రణతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని వైద్యాధికారులు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ డిగ్రీ ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి జనాభా పెరుగుదలతో కలిగే నష్టాలు, సంతానం విషయంలో పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. అనంతరం జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జనాభా నియంత్రణకు పాటుపడుతున్న ఉద్యోగులకు డీఎంహెచ్ఓ ప్రశంసాపత్రాలు నగదు అవార్డు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డాక్టర్లు సుజాత, యుగంధర్, నారాయణస్వామి, గంగాధరరెడ్డి, ఓబులు, రవిశంకర్, డెమోలు త్యాగరాజు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

టీచర్ ఉద్యోగార్థులకు బాసటగా అమిలినేని

- కళ్యాణదుర్గంలో డీఎస్సీ ఉచిత కోచింగ్ ఏర్పాటు
- అభ్యర్థులకు మధ్యాహ్న భోజన వసతి
- రోజుకు వెయ్యి మందికి శిక్షణ
- జిల్లా నలుమూలల నుంచి వస్తున్న నిరుద్యోగులు



డీఎస్సీ శిక్షణ పొందుతున్న ఉద్యోగార్థులు

కళ్యాణదుర్గం, జూలై 11: టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన నిరుద్యోగులకు టీచర్ ఉద్యోగం సాధించడమన్నది ఓ కల. దాన్ని సాకారం చేయడానికి కూటమి ప్రభుత్వం ఇటీవల మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. వేల సంఖ్యలో ఉన్న ఉద్యోగాలకు లక్షల మంది పోటీపడతారు. ఈ పోటీలో నెగ్గడానికి అభ్యర్థులకు సరైన శిక్షణ అవసరం. కరువు జిల్లాలో పేద కుటుంబాలకు చెందిన అభ్యర్థులకు ఇది ఆర్థికంగా భారమైన అంశం. ఇలాంటి వారి భారాన్ని తీర్చడానికి, ఉపాధ్యాయ ఉద్యోగం కల సాకారం చేసుకునేలా శిక్షణ ఇప్పించడానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముందుకు వచ్చారు. ఈ క్రమంలోనే ఈనెల మూడున ఉచిత మెగా డీఎస్సీ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. విజయవాడ, హైదరాబాద్, గుంటూరు, కాకినాడ, కర్నూలు, తదితర ప్రాంతాల నుంచి అధ్యాపకులను పిలిపించి శిక్షణ ఇప్పిస్తున్నారు. రాష్ట్రస్థాయి అధ్యాపకులచే ఈ శిక్షణ ఇస్తుండటంతో జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు దుర్గం వైపు అడుగులు వేస్తున్నారు. అనంతపురం, తాడిపత్రి, కదిరి తదితర సుదూర ప్రాంతాల నుంచి కూడా వచ్చి శిక్షణ పొందుతున్నారు. శిక్షణకు వచ్చే నిరుద్యోగులకు మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో ఏ ఎమ్మెల్యే చేయని విధంగా నిరుద్యోగులకు శిక్షణ ఉచిత పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజన వసతి కల్పించడం హర్షించదగ్గ విషయమని ప్రజలు కొనియాడుతున్నారు. ఈ మెగా డీఎస్సీ ఉచిత శిక్షణకు రోజురోజుకీ ఆదరణ పెరుగుతోంది. రోజూ వెయ్యి మంది శిక్షణ తీసుకుంటున్నారు.

ఎంతో ఉపయుక్తం



మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ మాలాంటి నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయుక్తం. అనుభవజ్ఞులైన అధ్యాపకులచే బోధిస్తుండ టంతో పాఠాలు చాలా చక్కగా అర్థమవుతున్నాయి. ముఖ్యంగా మహిళలు సుదూర ప్రాంతాలకు వెళ్లి శిక్షణ తీసుకోకుండా ఊరికి కొద్ది దూరంలోనే కోచింగ్ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు.

- శిల్ప, మోపిడి గ్రామం, ఉరవకొండ మండలం

యువతకు వరం



నేను నాన్ మ్యాథ్స్ స్టూడెంట్. అయిన పాఠాలు బాగా అర్థం అవుతున్నాయి. మాలాంటి నిరుపేద యువతకు ఇది ఒక వరం. మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పిస్తున్నారు. ఇక్కడ కు వస్తున్న నిరుద్యోగులకు ఎటువంటి లోటు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబుకు రుణపడి వుంటాం.

- గోవిందనాయక్, బెళుగుప్ప తండా

నిరుద్యోగులకు మేలు



ఉచిత శిక్షణ మాలాంటి నిరుద్యోగులకు మేలు. డీఎస్సీ కోసం చదువుతున్న మాలాంటి నిరుద్యోగులు శిక్షణ తీసుకోవాలంటే వేలకు వేలు ఫీజులు కట్టడం అసాధ్యం. డబ్బులు కట్టి చదివే స్తోమత లేని నిరుపేదలకు ఇది ఒక వరం. ఉచిత శిక్షణ ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్నాం.

- భవ్యశ్రీ, ఉరవకొండ

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



డీఆర్ఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు

గుంతకల్లు, జూలై 11: కొత్త పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ కార్యదర్శి ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం ఉదయం పట్టణంలోని సంఘ్ నాయకులు డీఆర్ఎం కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ్ డివిజనల్ కార్యదర్శి మాట్లాడుతూ మేలు జరుగుతుందంటూ 2004లో అమల్లోకి తెచ్చిన కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. రిటైరైన తర్వాత తగిన పెన్షన్ రాక ఉద్యోగులు చికితిపోతున్నారని తెలిపారు. 2004లో ఉద్యోగంలో చేరి ఇప్పటికే రిటైరైన ఉద్యోగులకు సగం జీతం అటుంచి, బేసిక్‌లో 10 శాతం కంటే తక్కువ మొత్తాలు పెన్షన్ లభిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వృద్ధాప్యంలో ఆదరించేవారులేక రిటైర్డ్ ఉద్యోగి అవస్థలు పడక తప్పదన్నారు. ఈ కారణంగా తమ ఏకైక డిమాండ్ ఓపీఎస్‌ను పునరుద్ధరించడమేనని పేర్కొన్నారు. ఎంప్లాయీస్ సంఘ్ డిప్యూటీ డివిజనల్ సెక్రెటరీ కే మల్లికార్జున, సీడబ్ల్యూసీ సభ్యులు కుళ్లాయప్ప, వెంకటేశ్వర్లు, వివిధ బ్రాంచ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

నెట్టికంటి ఆలయంలో ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

గుంతకల్లు, జూలై 11: ఆషాఢ పంచమి తిథిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ధన్వంతరి హోమాన్ని నిర్వహించారు. గురువారం ఉదయం వేదపండితుడు రామకృష్ణావధాని ఆధ్వర్యంలో వేదపండితులు, అర్చకులు యాగ శాలలో స్వామివారి చిత్రపటాలకు పూలమాలలను వేసి శాస్త్రోక్తంగా హోమాన్ని నిర్వహించారు. ధన్వంతరి ఆవిర్భావోపాఖ్యానాన్ని వివరించారు.

కవితా సంపుటాల ఆహ్వానం



అనంతపురం కల్చరల్, జూలై 11: కొత్తపల్లి నరేంద్ర బాబు సాహిత్య పురస్కారం-2024 కోసం కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు కవి సమ్మేళనం సాహిత్యవేదిక నిర్వాహకుడు కొత్తపల్లి సురేష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల కవులు 2023లో ప్రచురితమైన తమ కవితా సంపుటాలను నాలుగు కాపీలు చొప్పున ఆగస్టు 15లోపు కొత్తపల్లి సురేష్, డోర్ నెం.33-123-1, నారాయణ స్కూల్ వెనుక, టీవీఆర్ కాలనీ, కళ్యాణదుర్గం రోడ్డు, అనంతపురం అనే చిరునామాకు పంపాలన్నారు. వివరాలకు 9493832470 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

పత్తిలో సస్య రక్షణ చర్యలు చేపట్టండి

పుట్టపర్తి రూరల్, జూలై 11: జిల్లాలో సాగు చేసిన పత్తి పంటలో చీడపీడల నివారణకు రైతులు వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ జాన్సన్, శాస్త్రవేత్త రామసుబ్బయ్య పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని ఏరువాక కేంద్రం కార్యాలయంలో వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో సాగు చేసిన పత్తిపంట విత్తేదశ నుండి 50 రోజుల మొక్క దశలో ఉందన్నారు. జిల్లాలోని రొద్దం, కనగానపల్లి, మడకశిర, గుడిబండ, అమరాపురం మండలాల్లో రైతన్నలు సాగుచేశారన్నారు. పత్తిపంటను రసంపీల్చే పురుగులు ఆశించనట్లు తమ పరిశీలనలో తేలిందన్నారు. వ్యవసాయాధికారులు సూచించిన మేరకు పురుగుమందులు వాడాలని రైతులకు సూచించారు.

జిల్లాకు వచ్చిన ఇంటర్ సర్టిఫికెట్లు

అనంతపురం విద్య, జూలై 11: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇంటర్ బోర్డు నుంచి ఆర్ఐఓ ఆఫీస్‌కు వచ్చాయని ఆర్ఐఓ వెంకటరమణ నాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి, మే 2024లో జరిగిన ఇంటర్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షల్లో పాసైన సెకెండ్ ఇయర్ విద్యార్థుల సర్టిఫికెట్లు ఆర్ఐఓ ఆఫీస్‌కు వచ్చాయన్నారు. శుక్రవారం నుంచి అన్ని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆఫీస్‌కు వచ్చి విద్యార్థుల సర్టిఫికెట్లు తీసుకెళ్లాలని ఆయన ఆదేశించారు. విద్యార్థులకు వెంటనే సర్టిఫికెట్లు అందించాలని సూచించారు.

టీబీ డ్యాంలో 27 టీఎంసీల నీరు



డ్యాంలో వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 11: తుంగభద్ర జలాశయానికి 27.330 టీఎంసీల నీరు చేరింది. గురువారం ఉదయానికి ఇన్‌ఫ్లో 25,349 క్యూసెక్కులకు చేరింది. కొద్దిరోజులుగా ఇన్‌ఫ్లో హెచ్చుతగ్గుల మధ్య సాగుతోంది. ఔట్ ఫ్లో 205 క్యూసెక్కులు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

టమోటా కిలో రూ.45

అనంతపురం రూరల్, జూలై 11: కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.45తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 85టన్నుల టమో టా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి రూ.40, కనిష్ఠ ధర రూ.32 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.20వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.20వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి తెలిపారు.

పట్టుదల, కృషితోనే విజయం సొంతం

- యుఎస్ఏ స్పెల్‌బీ ఫైనలిస్ట్ ఆకాష్ వుకోటి
- నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ'కి అనూహ్య స్పందన



ఉత్సాహంగా సాగిన విజయోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

అనంతపురం విద్య, జూలై 11: పట్టుదల, కృషి ఉంటే విద్యార్థులు తప్పకుండా విజయం సాధిస్తారని చైల్డ్ ప్రాడిజీ, యుఎస్ఏ స్పెల్‌బీ ఫైనలిస్టు ఆకాష్ వుకోటి పేర్కొన్నారు. గురువారం బెంగళూరు వైట్ ఫీల్డ్‌లోని ఎంఎల్ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నారాయణ 'సక్సెస్ ఒడిస్సీ' పేరుతో విజయోత్సవం నిర్వహించారు. ఆకాష్ వుకోటి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ నారాయణ విద్యాసంస్థలు అంకితభావానికి దర్పణంగా నిలుస్తాయన్నారు. ఈ సక్సెస్ ఒడిస్సీ చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా నారా యణ మరిన్ని విజయోత్సవాలు జరుపుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం భాషానైపుణ్యంతోపాటు, పోటీతత్వ స్ఫూర్తిని చాటే స్పెల్‌బీ ప్రోగ్రాంపై సాగిన చర్చ ఆకట్టుకుంది. తర్వాత నీట్ టాపర్ సామ్ శ్రేయాస్ జోసెఫ్ తండ్రి మాట్లాడుతూ... నారాయణ సంస్థ అందించిన విద్యాబోధనతోనే జోసెఫ్ ఘన విజయం సాధించాడన్నారు. తర్వాత కర్ణాటక రాష్ట్ర వ్యాప్తంగా పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చూపిన 17 మంది విద్యార్థులను సత్కరించారు. కర్ణాటక దర్శిని పేరుతో సాగిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నారాయణలో జేఈఈ, నీట్, కె సెట్, బోర్డు పరీక్షల్లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, సుమారు 800 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను మట్టికరిపించిన అనంత జట్టు

● కబడ్డీ టోర్నీ విజేత కేంద్రీయ విద్యాలయ జట్టు



ట్రోఫీ, పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్

అనంతపురం సెంట్రల్, జూలై 11: ప్రాంతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొన్న అనంతపురం కేంద్రీయ విద్యాలయం జట్టు హైదరాబాద్ గచ్చిబౌలి కేంద్రీయ విద్యాలయ జట్టును మట్టికరిపించింది. కేంద్రీయ విద్యాలయ విద్యార్థులకు గుంటూరులో నిర్వహించిన రీజనల్ లెవెల్ అండర్-17 కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అనంతపురం కేంద్రీయ విద్యాలయ జట్టు టోర్నమెంట్ కప్‌ను కైవం చేసుకుంది. గెలుపొందిన జట్టు విద్యార్థులను గురువారం ప్రిన్సిపాల్ కరీమ్‌ఖాన్ మెడల్స్‌తో సత్కరించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రవ్యాప్తంగా 25 జట్లు పాల్గొనగా అనంతపురం జట్టు టోర్నమెంట్‌లో గెలుపొంది కప్‌ను గెలుచేకోవడం హర్షణీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న జట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన బాలికలతో ఢిల్లీలో నేషనల్ టోర్నమెంట్ నిర్వహించన్నుట్లు తెలిపారు. వీరిలో అనంతపురం కేంద్రీయ విద్యాలయ జట్టునుంచే లిఖిత, మహిమ జ్యోతి, చిన్మయి, భాను మహేశ్వరి ఎంపియ్యారన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: నంద్యాల జిల్లాలో చిన్నారిపై అత్యాచారం చేసి, హత్య చేసినవారిని కఠినంగా శిక్షించాలని పలువురు నాయకులు డిమాండ్ చేశారు. వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో చిన్నారి ఆత్మకు శాంతి కలగాలని, హంతకులను కఠినంగా శిక్షించాలని గురువారం సాయంత్రం టవర్‌క్లాక్ నుంచి డీఎస్పీ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఎస్పీకి వినతిపత్రం అందజేశారు. జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, వాల్మీకి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అక్కులప్ప, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, టీడీపీ నాయకులు కమ్మూరు నాగరాజు, భాగ్యరాజు, శంకర నారాయణ, పాల్గొన్నారు.

అనంతపురం సెంట్రల్: బాలికను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. బాలిక మృతికి గురువారం ఆ సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహంవద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. నాయకులు శాంతమ్మ, మారెక్క, పద్మావతి, రమాదేవి, కేపీరాజు, ఆదినారాయణ, ఈశ్వరయ్య, ధనుంజయ, అశిక్, నాగేంద్ర, మురళీ, నారాయణస్వామి, గోపాల్, ఓబులేసు పాల్గొన్నారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే గుమ్మనూరు



స్వామివారిని దర్శించుకుంటున్న జయరాం

నార్పల, జూలై 11: గూగూడు కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి వారిని గురువారం సాయంత్రం గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దర్శించుకున్నారు. మొదట కుళ్లాయిస్వామికి చక్కెర చదివింపులు చేసి, ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు, ముజావర్లు, అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. నాయకులు ఆకుల ప్రసాద్, ఆకుల తేజ, ఎమ్మెల్యే కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ఎంపీకి ఆహ్వానం

శింగనమల జూలై 11: నియోజకవర్గంలోని గూగూడు కుళ్లాయి స్వామి బ్రహ్మోత్సవాలకు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆహ్వానించారు. గురువారం ఎంపీ స్వగృహం వెళ్లి ఉత్సవాలకు హాజరుకావాలని కోరారు.

వీల్ చైర్‌ల వితరణ



వీల్‌చైర్‌లను అందజేస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, జూలై 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరిటాలరవీంద్ర మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో రెండు వీల్‌చైర్‌లను గురువారం వితరణ చేశారు. టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పరిటాలసునీత సూచనల మేరకు రెండు వీల్‌చైర్‌లను డాక్టర్ ప్రతాప్‌కు అందజేశారు. టీడీపీ నాయకులు ఎస్.ఆంజనేయులు, గుర్రం శీన, అక్కులప్ప, సురేశ్, వెంకటేశ్,విశ్వనాథ్, క్రాంతి, మల్లేశ్, బేల్దారి వెంకటరాముడు, ఫార్మాసిస్టు ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాప్తాడు: పరిటాల రవీంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వీల్‌చైర్స్ వితరణ చేశారు. గురువారం రాప్తాడులో వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణిలకు వాటిని అందచేశారు. ఎంపీడీఓ గీతావాణి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, శీనా, కిష్ట, సత్తి పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో అనంత వాసుల ప్రతిభ



దేవరకొండ కౌసల్య బృందాన్ని సత్కరిస్తున్న సుమన్

అనంతపురం కల్చరల్, జూలై 11: నగరానికి చెందిన ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ కళాకారులు హైదరాబాద్‌లో ప్రతిభ చాటారు. మనం ఫౌండేషన్ 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ కోటిలోని తెలంగాణ సారస్వత భవన్‌లో గురువారం నిర్వహించిన వేడుకల్లో ఓం సంగీత నృత్య కోలాట శిక్షణా సంస్థ నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య బృందం సంప్రదాయ నృత్యాలతోపాటు కోలాటం ప్రదర్శనలతో వీక్షకులను అలరించారు. ఈ బృందానికి సినీనటుడు సుమన్, గజల్ శ్రీనివాస్ చేతుల మీదుగా జ్ఞాపికను బహూకరించి సత్కరించారు. అలాగే ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి గౌరవ డాక్టరేట్‌లు ఆ సంస్థ వారు అందజేశారు. అనంతపురం జిల్లా తరపున సేవా విభాగంలో సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్, కళారంగం విభాగంలో దేవరకొండ కౌసల్యకు గౌరవ డాక్టరేట్‌లు అందజేసి సత్కరించారు.

అభివృద్ధిని అడ్డుకుంటామంటే కుదరదు

● మండల సమావేశంలో టీడీపీ కన్వీనర్

చెన్నేకొత్తపల్లి, జూలై 11: అభివృద్ధిని ఎవరైనా అడ్డుకుంటే కుదరదని టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్ రెడ్డి అన్నారు. వైసీపీ పాలనలో మండలంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రజలందరికీ తెలుసని తాము ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశపు భవనంలో గురువారం ఎంపీపీ అంజలి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే పరిటాలసునీత తరపున ముత్యాల్‌రెడ్డి సమావేశానికి హాజరయ్యారు. పలుఅంశాలనుసమావేశంలో సభ్యులు అధికారుల దృష్టికితీసుకెళ్లారు. వివిధ గ్రామాలలో మంచినీటి సమస్య గురించి జడ్పీటీసీ గోవిందరెడ్డి సమావేశంలో పలువురు సర్పంచ్‌ల నుంచి ఆరాతీయగా కన్వీనర్ అభ్యంతరం తెలిపారు. 2014 నుంచి 2019 టీడీపీ హయాంలో గ్రామాలలో వాటర్ ప్లాంటును ఏర్పాటు చేశామన్నారు. 2019లోవైసీపీ అధికారంలోకి రాగానే ప్లాంట్లకు రంగులను మార్చి రాజకీయం చేసింది వాస్తవం కాదా అనిప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిఏకపక్ష విధానాలు కాకుండా ప్రజలకు మేలు చేసేలా పనిచేస్తామని, సభ్యులు మండల అభివృద్ధి కావాలా అని ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ఎంపీడీఓ మోహన్‌కుమార్ కలుగజేసుకుని వివాదాలను పక్కనపెట్టి సమస్యల పరిష్కారం దిశగా ముందుకు వెళ్లాలని సూచించారు. తహసీల్దార్ హమీద్‌బాషా, ఈఓఆర్‌డీ అశోక్‌నాయక్ పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చే ఇళ్లలో పార్టీలు చూడం: ఎమ్మెల్యే



హౌసింగ్ అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

అనంతపురం రూరల్, జూలై 11: పేదలకు ఇచ్చే ఇళ్లలో పార్టీలు చూడమని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జగనన్న లేఅవుట్లలో హౌసింగ్ అక్రమాలపై చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. గురువారం ఆలమూరులోని లేఅవుట్‌లో అనంతపురం అర్బన్‌కు సంబంధించిన ఇళ్ల నిర్మాణాలను హౌసింగ్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాలు, నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని ఇళ్లు ప్రారంభించారు. ఎన్ని పూర్తి చేశారు. లబ్ధిదారులకు ఎన్ని ఇచ్చారు. మౌలిక వసతుల కల్పన తదితరవాటిని హౌసింగ్ అధికారులను వివరాలను అడిగితెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో వైసీపీ నాయకులు చెప్పినట్టుగా పరిస్థితి ఇక్కడలేదన్నారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో నిర్మిస్తున్నారన్నారు. స్థానికంగా 7వేల ఇళ్లలో 12వందల ఇల్లు మాత్రమే పూర్తి అయ్యాయన్నారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు వెంటనే చేపడుతామన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా లోపం కనిపిస్తోందన్నారు. ఇప్పటికీ నగరంలో చాల మంది ఇళ్లు కావాలని అడుగుతున్నారని, ఇక్కడ వెయ్యి వరకు ఉన్నాయని, వీటిని త్వరలోనే లబ్ధిదారులకు అందిస్తామన్నారు. హౌసింగ్, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మీ ఉద్యోగ భద్రతకు మాది హామీ

అనంతపురం అర్బన్: మీ ఉద్యోగ భద్రతపై మాది హామి అని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఆర్ అండ్‌బీ అతిథి గృహంలో ఎమ్మెల్యేను మెప్మాలో పనిచేసే ఆర్పీలు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. మీ సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

అనంతపురం న్యూటౌన్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న రుద్రంపేట పంచాయతీలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు కాంగ్రెస్ నాయకులు వాసు, శర్మాస్ వినతి పత్రం సమర్పించి విన్నవించారు. గురువారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్‌కు వచ్చిన ఆయనను కాంగ్రెస్ నాయకులు కలిశారు. సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. ప్రధానంగా రుద్రంపేట ప్రాంతంలో అన్యాక్రాంతం అయిన ప్రభుత్వ స్థలాలు పరిరక్షించాలని కోరారు.

ఎమ్మెల్యేను కలసిన అపుస్మా నాయకులు

అనంతపురం విద్య: ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌ను ఏపీ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) జిల్లా నాయకులు కలిశారు. గురువారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పుల్లారెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్ర, గౌరవాధ్యక్షుడు నాయుడు ఎమ్మెల్యేను కలసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేట్ స్కూళ్ల సమస్యలను వారు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్టేట్ కన్వీనర్ నాగరాజు, నగర అధ్యక్షులు శ్రీనాథ్, సూర్యనారాయణరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, జలీల్, అన్వర్, లక్ష్మణ్, రఘునాథ్‌రావు, రామూర్తి పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఉమర్ ముక్తార్



మంత్రి లోకేశ్‌కు మొక్కను అందిస్తునన ఉమర్ ముక్తార్

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 11: రాష్ట్ర విద్యాశాఖమంత్రి నారా లోకేశ్‌ను జడ్పీ మాజీ చైర్మన్ చమన్ సాబ్ తనయుడు, టీడీపీ నాయకుడు ఉమర్ ముక్తార్ కలిశారు. గురువారం మంగళగిరిలోని లోకేశ్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. కూటమి అధికారంలోకి రావడంతో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో... ఉమర్ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆరెకటిక సాధికార సమితి ఆధ్వర్యంలో...



మంత్రికి శివాజీ విగ్రహాన్ని అందజేస్తున్న బాల్జీరావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 11: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను జిల్లా అరెకటిక సాధికారక కమిటీ సభ్యులు కలిశారు. గురువారం మంగళగిరిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సభ్యులు కటిక బాల్జీరావు మర్యాదపూర్వకంగా కలిసి ఆరెకటిక ఆరాధ్యదైవమైన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని బహూకరించారు. మంత్రిని కలిసిన వారిలో గుంతకల్లు అశోక్‌రావు, ప్రసన్నకుమార్, ఎంబీ యోగ మహేష్ పాల్గొన్నారు.

యోగా కోచ్‌కు అభినందనలు



మంత్రికి సర్టిఫికెట్ చూపుతున్న మహేష్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: జిల్లాకు చెందిన యోగా కోచ్ మహేష్‌బాబుకు మంత్రి నారా లోకేశ్ అభినందించారు. మహేష్‌బాబు పది సంవత్సరాలుగా నెహ్రూ యువ కేంద్రం, పతంజలి ద్వారా 400పైగా ఉమ్మడి జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ తరగతులకు వరల్డ్‌రికార్డు సర్టిఫికెట్ పొందారు. గురువారం కోచ్‌ను మంత్రి లోకేశ్ సత్కరించారు.

జాతీయ క్రీడ హాకీని కాపాడాలి



క్రీడామంత్రికి హాకీ స్టిక్, మొక్కను అందజేస్తున్న సీనియర్ క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 11: జాతీయ క్రీడ హాకీని కాపాడాలని సీనియర్ హాకీ క్రీడాకారులు కోరారు. గురువారం కడపలో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని క్రీడాకారులు సుబాన్‌బాషా, చంద్రశేఖర్ కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో హాకీ క్రీడను ఐదేళ్లుగా నిర్వీర్యం చేశారని తెలిపారు. క్రీడాశాఖను నిర్లక్ష్యం చేయడంతో పాటు క్రీడాసంఘాల్లో వైసీపీ రాజకీయం చేసి విభజించిందన్నారు. మంత్రి స్పందిస్తూ క్రీడల్లో రాజకీయజోక్యం ఉండరాదని, హాకీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 11: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆహారభద్రతశాఖ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ కళ్యాణచక్రవర్తి పిలుపునిచ్చారు. గురువారం ఆహారభద్రతశాఖ కార్యాలయ ఆవరణలో ఆయన ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యాలయ సిబ్బంది హరి, మహేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

అర్హులైన లబ్ధిదారులకు ఇంటి స్థలాలు ఇవ్వండి

నార్పల, జూలై 11: మేజరు పంచాయతీలో అర్హులైన వారికి ఇంటి స్థలాలు ఇవ్వాలని తెలుగు యువత మండల నాయకులు ఆకుల తేజ, ఆకుల అనిల్ గురువారం తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నార్పలలో కొందరు అనర్హులైన వారికి పట్టా లేకున్న దౌర్జన్యంగా ఇంటి స్థలాలను ఆక్రమిస్తున్నారన్నారు. నాయకులు ప్రసాద్, రామాంజి పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

రామగిరి, జూలై 11: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు విద్యాసామగ్రిని గురువారం పంపిణీ చేశారు. కుంటిమద్దిలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్దిరంగయ్య చేతులమీదుగా పుస్తకాల అందజేశారు. అలాగే మాదాపురం, పెనుబోలు, కొత్తగాదికుంట, పీఆర్‌కొట్టాల తదితర గ్రామాలలోకూడా పుస్తకాల పంపిణీ చేపట్టారు. మండల ప్రధాన కార్యదర్శి మారుతీప్రసాద్, జయచంద్రనాయుడు, పోతన్న, మాధవరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే చంద్రబాబు ఆశయం

● అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్



వినియోగదారులకు కందిబేడలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం టౌన్, జూలై 11: ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు ఆశయమని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ అన్నారు. వైసీపీ ఇష్టారాజ్య పాలన కారణంగా నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయని విమర్శించారు. అందుకే పేదలను ఆదుకునేందుకు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులను చంద్రబాబు అందిస్తున్నారని అన్నారు. సోనా మసూరి బియ్యం కిలో రూ.48, కంది పప్పు కిలో రూ.160 ప్రకారం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నగరంలోని రైతు బజారులో వినియోగదారులకు బియ్యం, కందిపప్పును గురువారం ఆయన అందజేశారు. రైతు బజారుతో పాటు రిలయన్స్ మార్ట్, డిమార్ట్, విశాల్ మార్ట్, మోర్ మార్కెట్‌లో ఇదే ధరలకు బియ్యం, కందిపప్పు అందిస్తామని తెలిపారు. ఆధార్ కార్డు లేదా రేషన్ కార్డు తీసుకువెళ్లినవారికి 10 కిలోల బియ్యం, కిలో కంది పప్పు తక్కువ ధరకు ఇస్తారని తెలిపారు. అనంతరం రైతు బజారులోని కూరగాయల వ్యాపారులతో మాట్లాడి, వారి సమస్యలను తెలుసుకున్నారు. నగరపాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఎస్‌ఓ శోభారాణి, రైస్ మిల్లర్స్, హోల్‌సేల్స్ అసోసియేషన్ నాయకులు, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎంపీని సన్మానించిన టీడీపీ నాయకులు

అనంతపురం అర్బన్, జూలై 11: అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. గురువారం నగర శివారులోని ఆయన నివాసంలో రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్యచౌదరి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయనాయుడు, తెలుగు యువత నాయకులు రాకేశ్ చౌదరి, నాయకులు కాశీవిశ్వనాథ్, సంతోష్, జస్వంత్ ఎంపీకి పూల మాల వేసి, శాలువ కప్పి సత్కరించారు.

భవిత కేంద్రాలను మరింత బలోపేతం చేయాలి

చెన్నేకొత్తపల్లి, జూలై 11: ప్రత్యేక అవసరాల ఉన్న పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన భవిత కేంద్రాలు మరింత బలోపేతం కావాలని ఎస్‌సీఆర్‌టీ రాష్ట్ర అధికారి దండేపాల్ అన్నారు. చెన్నేకొత్తపల్లిలోని భవిత కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. కేంద్రంలో వసతులను గురించి ఆరాతీశారు. పిల్లల ఎన్‌రోల్‌తో పాటు వారికి ఇస్తున్న ఫిజియోథెరపీ గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యాసమన్వయ కర్త ఆనంద్‌బాబు, ఎంఈఓలు మున్వర్‌బాషా, ప్రసూనకుమార్ నాయుడు, హెచ్ఎం విజయనిర్మల, ఐఈఆర్‌టీలు వెంకటలక్ష్మి, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులను కలిసిన కార్మిక పరిషత్ నాయకులు

అనంతపురం కల్చరల్, జూలై 11: ఏపీఎస్ ఆర్టీసీ కార్మిక పరిషత్ నూతన కార్యవర్గం ఆర్టీసీ అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. కార్మిక పరిషత్ అనంతపురం డిపో నూతన కమిటీ అధ్యక్షుడిగా గోపాల్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా జీకే మొహిద్దీన్, కార్యదర్శిగా జయప్రకాష్, సహాయ కార్యదర్శిగా మదార్, కోశాధికారిగా నారాయణ, ప్రచార కార్యదర్శిగా నారాయణస్వామి ఎన్నికయ్యారు. గురువారం అనంతపురం డీఎం నాగభూపాల్, అసిస్టెంట్ డిపో మేనేజర్ వినయ్, ఆర్టీసీ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్‌లను కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు ఏఐసీటీఈ స్కాలర్‌షిప్

అనంతపురం సెంట్రల్, జూలై 11: పాలిటెక్నిక్ అభ్యసిస్తున్న విద్యార్థులకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి(ఏఐసీటీఈ) ప్రగతి మెరిట్ స్కాలర్‌షిప్‌ను విడుదలచేసినట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి గురువారం ప్రకటనలో తెలిపారు. సాంకేతిక విద్యను ప్రోత్సహించేలా 9 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు ఇవ్వడం హర్షణీయమన్నారు.

సీఎం, డిప్యూటీ సీఎం చిత్రపటాల అందజేత

అనంతపురం అర్బన్, జూలై 11: అనంతపురం అర్బన్ పరిధిలోని 47వ డివిజన్ సోమనాథ్ నగర్ సచివాలయానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఫొటోలు టీడీపీ నాయకులు గురువారం అందజేశారు. సీఎం, డిప్యూటీ సీఎం ఫోటోలను సచివాలయంలో ఏర్పాటు చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. టీడీపీ అంగన్‌వాడీల సంఘం జిల్లా అధ్యక్షురాలు దళవాయి రమాదేవి, దళవాయి లక్ష్మి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



సుదీక్షరెడ్డి



అంజూమ్

శింగనమల జూలై 11: మండలం నుంచి ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన సుదీక్షరెడ్డి నూజివీడుకు, అంజూమ్ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను ఎంఈఓలు నరసింహరాజు, శివప్రసాద్, హెచ్ఎం సూజాతమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

చిన్న కుటుంబం.. చింతలేని కుటుంబం




శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

రాప్తాడు, జూలై 11: చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబం అని వైద్యాధికారి శివకృష్ణ అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా రాప్తాడు పీహెచ్‌సీ వైద్యాధికారులు శివకృష్ణ, శ్రావణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. సీహెచ్ఓ శివప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్‌బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శింగనమల: జనాభా నియంత్రణతోనే దేశ ప్రగతి సాధ్యం అని ఎంపీడీఓ వెంకటరమణ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి అధికారులు ర్యాలీ నిర్వహించారు అనంతరం మనహారంగా ఏర్పడ్డారు. తరిమెల వైద్యాధికారి శంకర్‌నాయక్, వైద్య సిబ్బంది గంగాధర్, ఆశ్వర్థ, హెచ్ఎం సూజాతమ్మ, నాగరాజు, శైలజ పాల్గొన్నారు.

అనంతపురం విద్య: నగరంలో భాష్యం పాఠశాల విద్యార్థులు ర్యాలీ చేశారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం నగరంలోని తెలుగుతల్లి విగ్రహం నుంచి మున్సిపల్ కార్పొరేషన్, సప్తగిరి సర్కిల్ మీదుగా భాష్యం స్కూల్ వరకూ ర్యాలీ కొనసాగింది. స్కూల్ ఆవరణలో ముఖ్యఅతిథిగా హాజరైన డీఎస్పీ ప్రతాప్‌కుమార్ స్కూల్ స్టాఫ్, పిల్లలతో కలసి మొక్కలు నాటారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. జిల్లా జెడ్ఈఓ రవివర్మ, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అనంతపురం సప్తగిరి సర్కిల్‌లో ర్యాలీ చేస్తున్న భాష్యం స్కూల్ విద్యార్థులు

వ్యవసాయంలో నూతన పరిశోధనలు జరగాలి

● ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, జూలై 11: వ్యవసాయంలో ప్రతి ఏడాది రైతులు నష్టాలతో ప్రయాణం చేస్తున్నారని, ఉమ్మడి జిల్లా శాస్త్రవేత్తలు నూతన పరిశోధనలు చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. గురువారం రేకలకుంట ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో వ్యవసాయం ప్రణాళిక, శాస్త్రవేత్తల పరిశోధనలపై అధ్యయనం, రైతులకు యాంత్రీకరణ యంత్రాలు పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేతో పాటు ప్రధానశాస్త్రవేత్త విజయ శంకర్‌బాబు, ఉద్యాన శాఖ ప్రధాన శాస్త్రవేత్త సుబ్రహ్మణ్యం, వేరుశనగ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ అజయ్‌బాబు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు రైతుల ముంగిట చేరినప్పుడే మీ ఫలితాలు విజయవంతం అవుతాయన్నారు. భవిష్యత్తులో వ్యవసాయం పట్ల ఆదరణ తగ్గకుండా, వాటి నుంచి అనేక లాభాలు వచ్చే విధంగా నూతన వంగడాలు తయారు చేయాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త విజయ్‌శంకర్‌బాబు మాట్లాడుతూ వేరుశనగ పంటపై ఉమ్మడి జిల్లాలో మరిన్ని నూతన పరిశోధనలకు శ్రీకారం చుట్టామన్నారు. రానున్న కాలంలో మెట్టవ్యవసాయంలో రైతుల మంచి పురోగతి సాధించే దిశగా పనిచేస్తామన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఉచితంగా పవర్‌స్ప్రేయర్, పట్ట, తదితర యంత్రాలను ఉచితంగా పంపిణీ చేశారు. శాస్త్రవేత్త గుత్తానారాయణస్వామి, నటరాజన్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జీసీ బాబు, రవీంద్రా, జొన్నారామయ్య, పెద్దప్ప, ఓబులపతి, రవి పాల్గొన్నారు. రేకలకుంట గ్రామం వద్ద ఉన్న ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా కేందం, వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎమ్మెల్యేకి విజ్ఞప్తి చేశారు. రేకలకుంట నుంచి సిద్దరాంపురం వరకు బీటీ రోడ్డు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. త్వరలోనే నిధులు మంజూరు చేసి అభివృద్ధి చేస్తామని ఆమె హమీ ఇచ్చారు.

అద్దె చెల్లించని 32 దుకాణాలు సీజ్



దుకాణాన్ని సీజ్ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం, జూలై 11: నగరపాలికకు అద్దెలు చెల్లించని దుకాణాలపై అధికారులు చర్యలు చేపట్టారు. టవర్‌క్లాక్ సమీపంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లో 32 దుకాణాలను గురువారం సీజ్ చేశారు. ఆ షాపుల లీజుదారులు కొన్ని నెలలుగా బాడుగులు చెల్లించడం లేదు. పలుమార్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. మొత్తం ఆ షాపుల నుంచి రూ.1.12కోట్లు బకాయిలు రావాల్సి ఉంది. అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారి సతీష్, ఆర్ఐ మురళి సిబ్బందితో కలిసి మున్సిపల్ కాంప్లెక్స్‌లోని 32 దుకాణాలను సీజ్ చేశారు. బకాయి మొత్తం ఏడురోజుల్లో చెల్లించాలని, లేనిపక్షంలో పంచనామా చేసి షాపు రూముల్లోని సామగ్రిని వేలం వేస్తామని, మిగిలిన మొత్తానికి కోర్టులో దావా వేసి బకాయిలు వసూలు చేసుకుంటామని అడిషనల్ కమిషనర్ హెచ్చరించారు. నగరపాలికకు చెందిన ఇతర షాపుల యజమానులు బకాయిలను వెంటనే చెల్లించకపోతే షాపులు సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. సోమవారానికి మరో 20 దుకాణాల సీజ్ చేయడానికి జాబితా సిద్ధం చేసినట్లు సమాచారం.

18, 19 తేదీల్లో సచివాలయాల వద్ద నిరసన



మాట్లాడుతున్న ఏపీ రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాల జిల్లా కార్యదర్శులు

అనంతపురం కల్చరల్, జూలై 11: ఖరీఫ్, రబీ ఇన్సురెన్స్ ప్రకటించాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులివ్వాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఏపీ రైతు, కౌలు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా 18,19 తేదీల్లో గ్రామ సచివాలయాల వద్ద నిరసనలు చేపట్టనున్నట్లు ఆ సంఘాల జిల్లా కార్యదర్శులు అన్నారు. గురువారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి, కౌలురైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరంగయ్య, ఏపీ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడారు. 2023 ఖరీఫ్, రబీలో తీవ్రమైన కరువు పరిస్థితులేర్పడ్డాయని, సకాలంలో వర్షాలు రాక పంటలన్నీ రైతులు పూర్తిగా నష్టపోయారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్‌లో 28 మండలాలను, రబీలో 14 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినా కరువు నివారణకు ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదన్నారు. తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి, ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయంను వెంటనే రైతుల ఖాతాల్లో జమచేయాలన్నారు.

ఇచ్చిన డబ్బు అడిగినందుకు దాడి

రాప్తాడు, జూలై 11: ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు తనపై దాడి చేశారని యర్రగుంటకు చెందిన జి. సుధీర్‌రెడ్డి రాప్తాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన మేరకు యర్రగుంటకు చెందిన సుధీర్‌రెడ్డి ఏడాదిన్నర క్రితం పాలచెర్లకు చెందిన సురేష్‌కు రూ.20 వేలు అప్పు ఇచ్చాడు. బ్యాంకు రుణం ఇప్పిస్తానని సురేష్ తన వద్ద నుంచి డబ్బు తీసుకుని మోసం చేశాడన్నారు. ఇచ్చిన డబ్బు తిరిగి ఇవ్వాలని సురేష్ ఇంటి వద్దకు వెళ్లి అడిగితే కాలయాపన చేశాడు. బుధవారం సాయంత్రం సురేష్ ఇంటి వద్దకు వెళ్లి డబ్బులు అడిగితే నామీద సురేష్, కుటుంబ సభ్యులు దాడి చేశారు. ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. సంఘటనపై రాప్తాడు పోలీసులకు బాధితుడు గురువారం ఫిర్యాదు చేశాడు.

యువకుడి ఆత్మహత్య



పవన్ (ఫైల్)

రాప్తాడు, జూలై 11: మండల కేంద్రంలోని అరవవీధిలో నివాసం ఉంటున్న మండల పవన్ (26) అనే యువకుడు గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు రాప్తాడుకు చెందిన సుబ్బన్న, నల్లక్కల కుమారుడు పవన్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. తాగుడుకు బానిసైన యువకుడికి ఆరోగ్యం క్షీణించి మతిస్థిమితం కోల్పోయాడు. మతిస్థిమితం నుంచి కోలుకోవాలని కుటుంబ సభ్యులు పలు ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించినా నయం కాలేదు. గురువారం మధ్యాహ్నం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో పవన్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పవన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పవన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రాప్తాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, జూలై 11: విద్యుత్ లైన్ల మరమ్మతులో భాగంగా నగరంలోని పలుప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాంనగర్, రిజిస్టర్ ఆఫీస్, పీటీసీ, కొవ్వూరు నగర్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పరిశ్రమలతో కళాశాలకు పరస్పర సంబంధాలు అవసరం



విద్యార్థులతో ఇంటరాక్ట్ నిర్వహిస్తున్న అధికారులు

అనంతపురం సెంట్రల్, జూలై 11: విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలంటే పరిశ్రమలతో కళాశాల పరస్పర సంబంధాలు అవసరమని యూఎస్ఏ శాప్ గ్లోబల్ ఉపాధ్యక్షులు సౌరభ్ సుమన్ అన్నారు. గురువారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో ఇండస్ట్రీ - ఇన్‌స్టిట్యూట్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య వక్తగా హాజరైన సౌరభ్ సుమన్ మాట్లాడుతూ జీవిత లక్ష్యానికి అనువైన నైపుణ్యాలను మెరుగు పరచుకోవాలని సూచించారు. తోటి విద్యార్థులు, సహచరులతో నైపుణ్యాలు, సామర్థ్యాలపై చర్చించడం ద్వారా కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. అనంతరం అనంతలక్ష్మి ఇంటర్నేషనల్ స్కూల్‌ను సందర్శించారు. కళాశాల రీసర్చ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ మురళీధర్, ప్రిన్సిపాల్ రామమూర్తి, అకడమిక్ డీన్ రాయుడు, సీఎస్ఈ డీన్ ప్రసాద్, స్కూల్ ప్రిన్సిపాల్ నలీనా, ఏఓ నరసింహారావు పాల్గొన్నారు.

ఆక్రమణపై చర్యలు తీసుకోండి

గుంతకల్లు, జూలై 11: పట్టణ శివారులోని హనుమాన్ సర్కిల్‌లో విలువైన స్థలం ఆక్రమణకు గురవడంపై చర్యలు తీసుకోవాలని మాజీ కౌన్సిలర్ రామచంద్ర తదితరులు తహసీల్దారుకు విన్నవించారు. తహసీల్దార్ శేషఫణిని గురువారం ఉదయం ఆయన కలిసి మాట్లాడారు. దేవేంద్రప్ప అనే వ్యక్తి అత్యంత విలువైన స్థలాన్ని ఆక్రమించాడని, దీనిపై మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, తహసీల్దార్ పరిధిలో ఉందంటూ రెవెన్యూ కార్యాలయానికి ఎండార్సు చేశారని తెలిపారు. కనుక మీరైనా స్పందించి ఆక్రమణపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడులు

గుత్తి, జూలై 11: పట్టణంలోని కమేళా వీధిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఓ ఇంటిపైన పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. ఐదుగురు పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 5వేల నగదు, 5సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

శిక్షణ తరగతులకు తరలిరండి

గుంతకల్లుటౌన్, జూలై 11: మదనపల్లి హార్సిలీ హిల్స్‌లో ఈనెల 24, 25వ తేదీలలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు జరగనున్నాయని, కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పోరుమామిళ్ల సుబ్బరాయుడు పిలుపునిచ్చారు. పట్టణంలోని బీటీ పక్కీరప్ప భవనంలో గురువారం ఏర్పాటు చేసిన యూనియన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ శిక్షణ తరగుతులలో మున్సిపల్ కార్మికుల సమస్యలు, ఇబ్బందులను చర్చిస్తారన్నారు. కనుక మున్సిపల్ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్, వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు చిరంజీవి, మండల అధ్యక్ష, కార్యదర్శులు సురేష్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హోమియో వైద్యశాల తనిఖీ

గుత్తి, జూలై 11: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న హోమియో వైద్య శాలను 4వ జోన్ ప్రాంతీయ హోమియో ఉపసంచాలకులు డాక్టర్ శేఖర్ రాజు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, హోమియో మందులను పరిశీలించారు. హోమియో వైద్య సేవల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హోమియో వైద్యాధికారి ఝాన్సీలక్ష్మీ, సిబ్బంది కరుణ, షాజిదా ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

ఉరవకొండ(వజ్రకరూరు), జూలై 11: వజ్రకరూరు మండలం వెంకటాంపల్లి తండా పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై డీఎల్‌పీవో నాగేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. తీర్మానాలు లేకనే బిల్లులు డ్రా చేశారని వార్డు సభ్యులు డీఎల్పీవోకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామ పంచాయతీలోని రికార్డులను డీఎల్పీవో పరిశీలించారు. గ్రామ పెద్దల సమక్షంలో విచారణ సాగించారు. తర్వాత విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయిన తెలిపారు. ఈవోఆర్డీ సదాశివ, కార్యదర్శి మురళి, వార్డు సభ్యులు రాజు, పాండు, నాగరాజు, లక్ష్మీబాయి, బంజారాసంఘం నాయకులు పాల్గొన్నారు.

కర్ణాటకలో నల్లంపల్లి వాసి మృతి

కణేకల్లు, జూలై 11: మండలంలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన చాముండి(29) అనే మహిళ కర్ణాటకలోని టుంకూరులో గురువారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. భర్త అక్కిరెడ్డితో పాటు బైక్‌లో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు గ్రామస్థులు తెలిపారు. ఇందులో అక్కిరెడ్డికి స్వల్ప గాయాలు కాగా చాముండి తలపై లారీ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు. బెంగుళూరులో జీవనోపాధి కోసం వలసవెళుతూ ప్రమాదానికి గురయ్యారు.

మధ్యాహ్న భోజనంతో పాటు పెరుగు

పెద్దవడుగూరు, జూలై 11: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలోకి అదనంగా పెరుగును వడ్డించనున్నట్లు జిల్లా తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రెటరీ దివాకర్‌రెడ్డి తెలిపారు. పాఠశాలకు గురువారం వెళ్లిన ఆయన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాలమేరకు 600మంది విద్యార్థులకు భోజనంతోపా టు అదనంగా పెరుగును సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

ఎన్‌సీసీ కేడెట్లకు సర్టిఫికెట్ల ప్రదానం

గుంతకల్లుటౌన్, జూలై 11: పట్టణంలోని శ్రీ శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీలో శిక్షణ పొందిన కేడెట్లకు గురువారం బీ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ కేసీ హరికుమార్ మాట్లాడుతూ. అనంతపురంలో ఎన్‌సీసీ నగర్‌లో ఫిబ్రవరి, మార్చి నెలల్లో నిర్వహించిన శిక్షణలో తమ కళాశాల నుంచి 16మంది కేడెట్స్ పాల్గొన్నార న్నారు. శిక్షణలో నేర్చుకునే ప్రతి అంశము వారి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్,ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

గుంతకల్లుటౌన్, జూలై 11: గుంతకల్లు-తిమ్మనచర్ల రైల్వే స్టేషన్ సమీపంలో ట్రాక్ పక్కన 60 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వృద్ధుడు గురువారం రాత్రి సాయంత్రం మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర తెలిపారు. ట్రాక్ పక్కన చిన్న గాయాలతో మృతి చెందాడన్నారు. మృతుడు చిలకపచ్చ కలర్ చొక్కా, నీలి, పచ్చ రంగులున్న గళ్ల పంచె, కాషాయరంగు టవాల్ ధరించాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అధిక జనాభాతో అనర్థాలు

- ప్రపంచ జనాభా దినోత్సవంలో వక్తలు
- జనాభా నియంత్రణపై పలుచోట్ల అవగాహనా ర్యాలీలు



గోనేహాళ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది, విద్యార్థులు

ఉరవకొండ, జూలై 11: అధిక జనాభాతో అనర్థాలు కలుగుతాయని ఎంపీడీఓ సుబ్బరాజు పేర్కొన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గురువారం వైద్యులు, వైద్యసిబ్బంది అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఇందులో ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. జనాభా పెరుగుదల కారణంగా పేదరికం, నిరుద్యోగ సమస్యలు ఏర్పడుతాయన్నారు. కనుక జనాభా నియంత్రణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. అలాగే మండలంలోని రాకెట్ల గ్రామంలోనూ వైద్యసిబ్బంది జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమాల్లో వైద్యులు సాహితి, పావని, ఈవో ఆర్డీ చంద్రమౌళి, ఏవో జయరాములు, కార్యదర్శి గౌస్ తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాళ్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండలంలోని గోనేహాళ్ గ్రామంలో శ్రీధరఘట్ట ప్రాథమిక వైద్యశాల సూపర్‌వైజర్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్ వెంకటరమణ సిబ్బంది, విద్యార్థులు కలిసి ర్యాలీ చేపట్టారు. పురవీధుల్లో తిరుగుతూ అధిక జనాభా వల్ల కలిగే నష్టాలను వైద్యాధికారులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆవులదట్ల ప్రాథమిక కేంద్రం పరిధిలోని వడ్రవన్నూరు గ్రామంలో వైద్యులు, వైద్యసిబ్బంది విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే అనర్థాల గురించి వైద్యుడు రాజేంద్రప్రసాద్ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామాంజనేయులు, విద్యార్థులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో పెరుగుతున్న జనాభాను నియంత్రించాలన్నారు. ఇందుకు ప్రజలను చైతన్యం చేయడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప అధిక జనాభాతో కలిగే నష్టాలను వివరించారు. జనాభా నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ ఎల్లారాయుడు, ఏఎన్‌ఎంలు,ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కుందుర్పి: మండలకేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది జనాభా నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు అనూష, చాంద్ బేగమ్ అధిక జనాభా వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో అధిక దిగుబడి

బొమ్మనహాళ్, జూలై 11: ఉద్యానవన పంటల సాగు మంచి దిగుబడినిస్తుందని, దీంతో రైతులు వాటి పెంపకంపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, డీఆర్‌పీ పీడీ రఘునాథరెడ్డి సూచించారు. మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో రైతు మారుతిప్రసాద్ సాగుచేసిన అల్లనేరేడు చెట్లను, నేరేడు పండ్ల ద్వారా తయారయ్యే జామ్, జ్యూస్ తయారీ విధానాన్ని గురువారం వారు పరిశీలించారు. నేరేడు పండ్ల దిగుబడి, జ్యూస్ తయారీ విధానం, మార్కెటింగ్ ఎలా సాగుతుందని రైతు ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. చౌడుభూముల్లో కూడా అద్భుతమైన నేరేడు పండ్లను పండించవచ్చు అని అన్నారు. రైతు మారుతిప్రసాద్ చౌడుభూమిలో అల్లనేరేడు పంట సాగుచేసి మంచి దిగుబడిని సాధిస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటలు పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా రాయితీలు కల్పిస్తోందన్నారు. జిల్లాలోని రైతులు ఉద్యాన పంటలపై దృష్టి సారిస్తే మంచి దిగుబడులు పొందే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి మౌనిక ఉన్నారు.



అల్లనేరేడు చెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

మొక్కలు నాటి సంరక్షించాలి

గుత్తి రూరల్, జూలై 11: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ సూచించారు. మండలంలోని రజాపురంలో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. ప్రిన్సిపాల్ ఉషారాణి, ఉపాధ్యాయినులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్ల గడువు పొడిగింపు

తాడిపత్రి, జూలై 11: పట్టణ సమీపంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపాల్ విజయలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20వరకు ఆన్‌లైన్‌లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 23నుంచి 26వ తేదీ వరకు కళాశాలల ఎంపిక, 31న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. కళాశాలలో బీఏ-హిస్టరీ, బీకాం - కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథమేటిక్స్, బొటని కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆన్‌లైన్‌లో తలెత్తే సమస్యలు, సందేహాలను నివృత్తి చేసుకోవడానికి కళాశాలలో హెల్ప్‌లైన్ సౌకర్యాన్ని ఏర్పాటుచేసినట్లు ఆమె తెలిపారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

పుట్లూరు, జూలై 11: మండలకేంద్రంలో తాగునీటి సమస్యకు పరిష్కారం చూపాలని టీడీపీ మండల నాయకుడు పుట్లూరు పుల్లారెడ్డి జడ్పీచైర్‌పర్సన్ బోయ గిరిజమ్మను కోరారు. జిల్లాకేంద్రంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలోని బీసీ, ఎస్సీ, ఓసీ కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రమైందన్నారు. దీంతో ఇతర గ్రామాల నుంచి ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. అరకొర నీరు సరిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. ప్రస్తుతానికి గ్రామంలో రెండుబోర్లు వేయించాలని జడ్పీ చైర్మన్‌కు విన్నవించినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట టీడీపీ నాయకులు రామాంజనేయులు, తేజ, నరసింహ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుల బాహాబాహీ

- ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల ముందే గొడవ
- ఆలస్యంగా వెలుగులోకి

యాడికి, జూలై 11: విద్యార్థులకు ఆదర్శంగా ఉండాల్సిన ఉపాధ్యాయులే వారి ముందు బాహాబాహీకి దిగిన సంఘటన మండలకేంద్రంలోని ఆదర్శపాఠశాలలో మంగళవారం జరిగింది. కాగా ఈ ఘటన ఆలస్యంగా రెండురోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదర్శపాఠశాలలో పనిచేసే కంప్యూటర్ ఉపాధ్యాయుడు, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడి మధ్య మంగళవారం మధ్యాహ్నం వాగ్వాదం చోటుచేసుకుంది. మాటమాటా పెరగడంతో ఆ ఇద్దరు బాహాబాహీకి దిగారు. తోటి ఉపాధ్యాయ సిబ్బంది సర్దిచెప్పినప్పటికీ వారు వినలేదు. దీంతో ఏమి జరుగుతుందోనని పాఠశాలలోని విద్యార్థులు, సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. చివరకు ఒక ఉపాధ్యాయుడి సమీప బంధువులు వచ్చి సర్దిచెప్పడంతో సమస్య సద్దుమణిగింది . ఈ గొడవ విషయాన్ని బయటకు రానీయకుండా చేయడం గమనార్హం. దీనిపై ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మారుతిని వివరణ కోరగా ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య వాగ్వాదం మాత్రమే జరిగిందని, గొడవ ఏమిలేదని తెలిపారు.

పట్టపగలే ఎలుగుబంట్ల సంచారం..

కళ్యాణదుర్గం (కంబదూరు), జూలై 11 : కంబదూరు సమీపంలోని రామప్ప కొండ, మేళ్లకుంట రహదారిలో పట్టపగలే ఎలుగుబంట్లు సంచరిస్తున్నాయి. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం ఉదయం పొలాల్లోకి ఎలుగుబంటి వెళ్లడంతో.. చూసిన రైతులు భయాందోళనకు గురయ్యారు. అవి పంట పొలాలను నాశనం చేస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తరచూ మూడు ఎలుగుబంట్లు పొలాల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని వాపోయారు. అటవీశాఖాధికారులు స్పందించి వాటిని బంధించాలని కోరారు.

కొలువుదీరిన పీర్లు



రాయలచెరువులో కొలువుదీరిన పీర్లు

యాడికి, జూలై 11: మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని పలు గ్రామాల్లో పీర్లచావిడిలో పీర్లు కొలువుదీరాయి. ముజావర్లు పీర్లను ప్రత్యేకంగా అలంకరించి ప్రార్థనలు నిర్వహించారు. పీర్లను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. యాడికి, రాయలచెరువు, వేములపాడు, తూట్రాళ్లపల్లి, చందన, పిన్నేపల్లి తదితర గ్రామాల్లో పీర్లు కొలువుదీరాయి.

గుత్తి: పట్టణంలో మొహరం వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బారీ ఇమామ్, బొడ్డుపీరు, పగ్గాల పీరు చావడిలలో పీర్ల పెట్టెలను దించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి ఊరేగింపు చేశారు. ఊరేగింపులో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎస్ఎస్ ట్యాంక్ పరిశీలన

విడపనకల్లు, జూలై 11: మండలంలోని 9 గ్రామాలకు తాగు నీరు అందించే మండల కేంద్రంలోని ఎస్ఎస్ ట్యాంక్‌ను టీడీపీ మండల నాయకులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకు నీరు లేక పూర్తిగా ఎండి పోయిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం పూర్తి స్థాయిలో ట్యాంకులకు నీరును అందించలేకపోయిందన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసు కెళ్లి నీటి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు చంద్రశేఖర్, తిమ్మరాజు, తిప్పారెడ్డి, జనార్ధననాయుడు, నాయకులు హనుమంతు, రామాంజి నేయులు, రా జు స్వామి, పరమేశప్ప, రంగస్వామి, తిప్పన్న పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం

తాడిపత్రి, జూలై 11: పట్టణ సమీపంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీపీ సరస్వతి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పలు ప్రజా సమస్యలను అధికారులకు విన్నవించారు. ఎంపీడీఓ నరసింహారావు మాట్లాడుతూ మండలంలో ఉన్న సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ జిలాన్‌బాషా, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరుగురు విద్యార్థులకు అస్వస్థత

తాడిపత్రి, జూలై 11 : పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఆరుగురు పాల్‌టెక్నికల్ విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. గురువారం పాల్‌టెక్నికల్ ఫలితాలు రావడంతో ఎక్కడ ఫెయిల్ అవుతామన్న భయంతో భోజనం చేయలేదు. దీంతో వారు నీరసించి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే స్పందించిన కళాశాల యాజమాన్యం వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

కుళ్లాయిస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే

నార్పల, జూలై 11: మండలంలోని గూగూడు కుళ్లాయి స్వామి, ఆంజనేయస్వామిని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. మొదట కుళ్లాయిస్వామిని దర్శించుకుని చెక్కెర చదివింపులు చేయించారు. తర్వాత అంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఎమ్మెల్యేకు, ముజావర్లు, అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆకుల ప్రసాద్, ఆకుల తేజ, ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కుళ్లాయిస్వామిని దర్శించుకుంటున్న గుమ్మనూరు జయరాం

విద్యుత్ సమస్యలను పరిష్కరించండి

- విద్యుత్‌శాఖ మంత్రిని కోరిన ఎమ్మెల్యే అమిలినేని

కళ్యాణదుర్గం, జూలై 11: కళ్యాణదుర్గం నియోజకవర్గంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కోరారు. విజయవాడలో గురువారం ఆయన మంత్రిని మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎక్కువ మంది వ్యవసాయంపై ఆధారపడ్డ రైతులే ఉన్నారన్నారు. వీరందరికీ సకాలంలో ట్రాన్స్‌ఫార్మర్లు అందించడమే కాకుండా, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని విన్నవించారు. తమ నియోజకవర్గానికి అధిక సంఖ్యలో ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన వెంట టీడీపీ సీనియర్ నాయకుడు రాజగోపాల్ ఉన్నారు.



మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు

సమష్టి కృషితోనే విజయం

కూడేరు, జూలై 11 : అసెంబ్లీ ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గం నుంచి పయ్యావుల కేశవ్ విజయం సాధించడం సమష్టి కృషితో సాధ్యమైందని ఆయన సోదరుడు పయ్యావుల శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలానికి చెందిన రేషన్ డీలర్లు, తెలుగుతమ్ముళ్లు గురువారం అనంతపురానికి పెద్దఎత్తున తరలివెళ్లి ఆయన్ను కలిశారు. పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. అనంతరం శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల్లో అందరూ సైనికుల్లా పని చేశారన్నారు. అందరి సమష్టి కృషితోనే విజయం సాధించామని పేర్కొన్నారు.



పయ్యావుల శ్రీనివాసులుతో రేషన్‌డీలర్లు

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న రైతులు

తాడిపత్రి, జూలై 11: పట్టణ సమీపంలోని పెన్నానదిలో నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను గురువారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నిత్యం వందలాది ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తున్నారన్నారు. తోటల రస్తా నుంచి తరలిస్తుండడంతో గుంతలమయమైందన్నారు. రస్తా ఇలా ఉంటే తోటలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. గతంలో పలుమార్లు ట్రాక్టర్ల డ్రైవర్లకు సూచించినా ఫలితం లేకపోయిందన్నారు. అందుకే ఇప్పుడు వాటిని అడ్డుకొని టైర్లకు గాలితీశారమన్నారు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు, సెబ్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఫిర్యాదుచేస్తే విచారించి న్యాయం చేస్తామని రైతులకు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

యాడికి, జూలై 11: మండలకేంద్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా గురువారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ ధ్వజస్తంభం సమీపం నుంచి ప్రధాన రహదారి వెంబడి అపోలో ఫార్మసీ వరకు సర్వే నిర్వహించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి ఆదేశాలమేరకు సర్వే చేస్తున్నట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు. అక్కడ ఉన్న దుకాణాలను తొలగించి అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు స్థానికులు చర్చించుకున్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఎస్పీకి ఫిర్యాదు

కూడేరు, జూలై 11 : మండలంలోని కమ్మూరు గ్రామానికి చెందిన ఈశ్వరయ్య అనేవ్యక్తి నాలుగు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. ఘటనపై ఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన సోదరుడు రమేష్ తెలిపారు. అతను తెలిపిన వివరాల మేరకు.. ఈశ్వరయ్య భార్య సువర్ణతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి గాలిస్తున్నా.. ఆచూకీ దొరకలేదని చెప్పారు. నాలుగు నెలలుగా వెతుకుతున్నా.. జాడ తెలియకపోవడంతో తమకు అనుమానాలు వస్తున్నాయన్నారు. ఈ విషయం పై మండలకేంద్రంలోని పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో గురువారం జిల్లాకేంద్రానికి వెళ్లి ఎస్పీ గౌతమిశాలికి ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.



ఈశ్వరయ్య

కన్నులపండువగా శోభాయాత్ర



శోభాయాత్ర ముందు నృత్యాలు చేస్తున్న చిన్నారులు

తాడిపత్రి, జూలై 11: పట్టణంలోని నంద్యాలరోడ్డులో ఉ న్న ఎస్ఎల్ఎన్ వరహాలు గార్డెన్స్‌లో లోకకల్యాణార్థం తలపెట్టిన భాగవత సప్తాహ జ్ఞానయజ్ఞ మహోత్సవం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా స్థానిక రెడ్డివారిపాలెంలో ఉన్న రాధాకృష్ణుల ఆలయం నుంచి భాగవత గ్రం థరాజాలతో అహోబల రామానుజ జీయర్ స్వామివారి ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. ఇందులో రాధాకృష్ణుల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. శోభాయాత్రలో పలువురు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం సామూహిక శ్రీ విష్ణుసహస్రనామ స్తోత్రపారాయణం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, హోమం తదతర పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం అహోబల రామానుజ జీయర్ స్వామి భాగవత మహత్యము గురించి ప్రవచనాలు చెప్పారు. స్వామివారి ప్రవచనాలకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు నిర్వాహకులు అల్పాహార విందు ఏర్పాటుచేశారు.

మెచ్చిరిలో కొనసాగుతున్న పికెట్

రాయదుర్గంరూరల్, జూలై 11: మండలంలోని మెచ్చిరి గ్రామంలో టీడీపీ నాయకుడు ఆదికేశవులు దారుణ హత్య కు గురికావడంతో కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు గురువారం పోలీస్ పికెట్ నిర్వహించారు. శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రత్యేక దృష్టి సారించారు.

క్వారీ బ్లాస్టింగ్‌లను నిలిపేయాలని ఆందోళన

డీ.హీరేహాళ్, జూలై 11: గ్రామ సమీపంలో భారీ శబ్ధంతో కూడిన క్వారీ బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నందున ఇళ్లు, వ్యవసాయ బోర్లు పూర్తిగా దెబ్బతింటున్నాయని, కావున వెంటనే అధికారులు ఈ బ్లాస్టింగ్ నిర్వహణను ఆపివేయాలని గ్రామస్థులు కోరారు. మండలంలోని పులకుర్తి, వనగుడ్డం గ్రామాల నడుమ ఉన్న ఆకుల తిప్పయ్య కొండ వద్ద ప్రైవేటు వ్యక్తులు వైట్ స్టోన్ క్రషర్ నిర్వహిస్తున్నారు. వాటి నుంచి నిత్యం భారీ శబ్ధాలతో కూడిన బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. దీంతో ఇరు గ్రామాల్లో ఇళ్లు, వ్యవసాయబోర్లు దెబ్బతింటున్నాయి. ఇందుకు ఆయా గ్రామస్థులు గురువారం ఆ క్రషర్ వద్ద ఆందోళన చేపట్టారు. బ్లాస్టింగ్ శబ్ధాలకు ఇప్పటికే ఆరు గ్రామాల్లో వందకు పైగాఇళ్లు దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ బోర్లు కూడా ధ్వంసమవుతున్నాయని వాపోయారు. సమస్యపై పలుమార్లు అధికారులకు క్రషర్ యజమానులకు తెలిపినా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి ఆ బ్లాస్టింగ్ నుంచి గ్రామాలను కాపాడాలని కోరారు. ఘటన స్థలానికి వచ్చిన తహసీల్దార్ బాల ఈశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రఘునాథ్, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి గ్రామస్థులతో మాట్లాడుతూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం రూరల్, జూలై 11: 73వ ఎంప్లాయిస్ యూనియన్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని యూనియన్ నాయకులు స్థానిక ఆర్టీసీ డిపోలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ సురేష్‌బాబు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నాగార్జున, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పసుపులేటి రాజు పాల్గొని పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రామలింగ తదితరులు పాల్గొన్నారు.

రహదారి ఏర్పాటుకు ముమ్మర యత్నం

కణేకల్లు, జూలై 11: మండల కేంద్రం నుండి గంగలాపురం, రచ్చుమర్రి గ్రామాలకు వెళ్లేందుకు రహదారి ఏర్పాటుకు టీడీపీ నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఆ రెండు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించాలంటే మండలకేంద్రంలోని శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుపై ఉన్న కల్వర్టుపై వెళ్లాల్సి ఉంది. కానీ ఆరునెలల క్రితం కల్వర్టు కూడా శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో అప్పట్లో మట్టిని వేసి తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. కాగా ప్రస్తుతం హెచ్చెల్సీకి నీరు వస్తుండడంతో వేసిన మట్టిని గురువారం టీడీపీ నాయకులు తొలగించి రహదారి ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఎలాంటి రోడ్డు ఏర్పాటు చేస్తే బాగుంటుందోనన్న ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నారు. మండల కన్వీనర్ లాలెప్ప, నాయకులు ఆనంద్‌రాజ్, చంద్రశేఖర్‌గుప్తా, బీటీ రమేష్, చాంద్‌బాషా, తిప్పేస్వామి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయంపై తొలగని జగన్ ఫొటో

యల్లనూరు, జూలై 11: కూటమి ప్రభుత్వం కొలువుదీరి నెలరోజులు పైబడి కావస్తున్నా మండలంలోని 85 నిట్టూరు గ్రామ సచివాలయంపై నేటికీ మాజీ సీఎం జగన్ ఫొటో తొలగలేదు. నవరత్రాల బోర్డు, జగన్ చిత్రం ఇం కా అలాగే దర్శనమిస్తున్నాయి. ఇ ది చూస్తున్న ప్రజ లు ఇక్కడి సచివాలయ సిబ్బంది ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అంటూ చర్చించుకుంటున్నారు.



సచివాలయం పైన ఉన్న జగన్ ఫొటో